
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా...
తెలంగాణ । ఆంధ్రప్రదేశ్ సంపుటి:1 । సంచిక: 21 హైదరాబాద్ గురువారం । 23-05-2024 పేజీలు:8 । వెల: రూ॥ 5

V3 NEWS
లక్ష్యం సమాజహితం


Ln. డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB



## దేశంలో మళ్లీ కరోనా విజృంభణ

- కొత్తగా నమోదవుతున్న కేసులు
- కేపీ-134, కేపీ-2 వేరియంట్ 290 కేసులు నమోదు
- భయపడాల్సిన అవసరం లేదన్న కేంద్ర ఆరోగ్య శాఖ
- ఈ కొత్త వేరియంట్లు ప్రాణాంతకం కాదని వెల్లడి

2 లో..



## ఎక్స్‌లో ఇకపై సినిమాలు, సీరియల్స్..

- పోస్ట్ చేసుకోవచ్చని ప్రకటించిన ఎలాన్ మస్క్
- మానిటైజ్ చేసుకొని డబ్బులు సంపాదించుకోవచ్చని సూచన
- ఎలాన్ మస్క్‌కు పలు సూచనలుచేసిన నెటిజన్స్

2 లో..




## ఇండియా కూటమి క్యాన్సర్ కంటే ప్రమాదకారి

- అది వ్యాపిస్తే దేశాన్నే నాశనం చేస్తుంది
- మతతత్వం, తీవ్ర జాతి వివక్ష, బంధుప్రీతి ఈ కూటమి వ్యాధులు
- యూపీ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ఫైర్

**విశ్వంభర, లక్నో:** విపక్ష ఇండియా కూటమి క్యాన్సర్ కంటే ప్రమాదకారి అని... అది వ్యాపిస్తే దేశాన్నే నాశనం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం యూపీలోని స్రవస్థిలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... విపక్ష ఇండియా కూటమికి మతతత్వం, తీవ్ర జాతి వివక్ష, బంధుప్రీతి వంటి వ్యాధులున్నాయన్నారు. ఇవి క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన వ్యాధులన్నారు.

మిగతా 2 లో




# టోల్ మోత

## దేశవ్యాప్తంగా జూన్ 1 నుంచి అమలు

### 5 శాతం మేర పెరిగిన టోల్ ఛార్జీలు

- రూ.5 నుంచి 15 రూపాయలు పెరుగుదల
- ఆర్టీసీ బస్సులకు రూ.20 టోల్ మోత
- హైదరాబాద్- విజయవాడ హైవేపై మూడు ప్లాజాలు
- వరంగల్ హైవే గూడురులో ఒక టోల్ ప్లాజా
- ఒక్కో టోల్ ప్లాజా నుంచి నిత్యం 30 వేలకు పైగా వాహనాలు
- ప్రకటించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** హైదరాబాద్‌కు చెందిన వనం రాకేష్, నిర్మల దంపతులు విజయవాడలోని ఓ ప్రముఖ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంటారు. అయితే ఫ్యామిలీ మొత్తం హైదరాబాద్‌లోనే ఉంటుంది. వీరి పిల్లలు సైతం హైదరాబాద్‌లోని తాత, నానమ్మల వద్ద ఉంటారు. అయితే ప్రతివారం పిల్లలను చూసేందుకు రాకేష్, నిర్మల మాత్రమే వారానికోసారి హైదరాబాద్‌కు వచ్చిపోతుంటారు. అయితే రాకేష్ హైదరాబాద్‌కు వెళ్లాలంటే.. 3 టోల్ ప్లాజా ఛార్జీలు చెల్లించాలి. దాదాపు రూ.700 వరకు టోల్ ఛార్జీలు అవుతాయి. దీనికి తోడు ప్రెటోల్ ఛార్జీలు మరో రూ.2వేలు అవుతుంది. వారానికోసారి వచ్చిపోతే

మిగతా 2 లో

# రేషన్.. వెరీ స్మార్ట్

## తెలంగాణ కొత్త రేషన్ కార్డుల జారీ

- కార్డులో కీలక మార్పులు చేయనున్న సర్కార్
- ఆరోగ్య శ్రీని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం
- ప్రస్తుతం రాష్ట్రంలో 89,98,546 ఆహార భద్రత కార్డులు
- వాటి స్థానంలో నయా లుక్‌తో కొత్త రేషన్ కార్డులు జారీ
- ఎన్నికల కోడ్ ముగియగానే పంపిణీ చేయనున్న ప్రభుత్వం




**విశ్వంభర హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుల జారీ విషయంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న ఆహార భద్రత కార్డుల రూపం మార్చనున్నారు. వీటి స్థానంలో కొత్త కార్డులు జారీ చేసేందుకుంద రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు.. ఆరోగ్యశ్రీ కార్డులతో గతంలో ఉన్న 5 లక్షల రూపాయల చికిత్స పరిమితిని 10 లక్షల రూపా యల వరకు పెంచింది. కాబట్టి ఆరోగ్యశ్రీ పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

మిగతా 2 లో

## మార్పు మార్పు అంటే ఇప్పుడు ఏమైంది..?

### మళ్లీ మోసపోతే గోస పడతారు

- తీన్మార్ మల్లన్నవి ఉద్యమ కేసులు కావు.. బ్లాక్ మెయిల్ కేసులు
- గోల్డ్ మెడలిస్ట్ కావాలా, బ్లాక్ మెయిలర్ కావాలా..?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తిని గెలిపించండి
- నర్సంపేట పట్టభద్రుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్



**విశ్వంభర, నర్సంపేట:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వైపుగా ఓట్లేయాలని, మీకు గోల్డ్ మెడలిస్ట్ కావాలా, బ్లాక్ మెయిలర్ కావాలా తేల్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నర్సంపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మళ్లీ మోసపోతే గోస పడుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్పు మార్పు అంటే ఏమైందని ప్రశ్నించారు.

మిగతా 2 లో



## తిరుమలలో సత్రాలు, కల్యాణ మండపం నిర్మిస్తాం

- భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం
- ఏపీలో రాబోయే ప్రభుత్వంతో స్నేహ పూర్వకంగా ఉంటాం
- రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి వైపు పయణించాలి
- త్వరలోనే ఏపీ ముఖ్యమంత్రిని కలుస్తాను
- తిరుమలలో దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, తిరుమల:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం శ్రీవారికి తన మనవడి పుట్టువెంట్రుకల మొక్కు చెల్లించారు. అనంతరం ఉదయం 8.30గంటలకు వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి శ్రీవారి దర్శనానికి వెళ్లిన రేవంత్ రెడ్డికి

మిగతా 2 లో



## జాతీయ స్థాయిలో భట్టి మార్క్

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భట్టి ప్రచారం
- అభ్యర్థుల గెలుపునకు తిరుగులేని వ్యూహాలు
- పలు రాష్ట్రాల్లో భట్టికి బాధ్యతలు అప్పగించిప ఏఐసీసీ
- అధిష్టానం మెప్పు పొందిన ఉప ముఖ్యమంత్రి

2 లో..

## బాలికపై రాపిడో డ్రైవర్ అత్యాచారం

- ఫోన్ మాట్లాడొద్దని మందలించిన తల్లిదండ్రులు
- అలిగి బయటకు వచ్చిన బాలిక
- రోడ్డుపై ఉన్న బాలికను లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యం
- యువకుడిపై తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర | : రూ.150 |
| రిటైల్ | : రూ. 172 |
| స్కిన్ | : రూ. 249 |
| స్కిన్ లెస్ | : రూ.284 |

## మేడిగడ్డకు నిపుణుల కమిటీ

- ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ముగ్గురు సభ్యుల టీం
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలూ సందర్శన
- బ్యారేజీలో జరుగుతున్న తాత్కాలిక రిపేర్ల పరిశీలన
- నేడు జలసౌధలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీతో భేటీ

2 లో..



## దొడ్డు వడ్లు కొనేందుకు కేంద్రం సిద్ధం

- కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమిటి?
- వడ్లకు రూ.500 బోనస్, రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్
- రైతులను మోసం చేయడమే కాంగ్రెస్ నాయకుల పని..
- టీ సర్కార్‌పై కేంద్రమంత్రి, టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఫైర్

2 లో..



# టోల్ మోత

(మొదటిపేజీ తరువాయి)

రూ.5400 నుంచి రూ.5800 వరకు ఖర్చు అవుతుంది. నెలకు నాలుగుసార్లు హైదరాబాద్‌కు వెళ్లి వస్తే రూ. 20 వేల నుంచి రూ. 28 వేలకు వరకు ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. ఇలాగైతే.. మాకొచ్చే జీతంలో సగం వరకు ప్రయాణ ఖర్చులకే సరిపోతుందని వాపోతున్నారు. ఇలాంటి వారిపై మరోసారి టోల్ ఛార్జీల పిడుగు పడింది

మరోసారి వాహనదారులపై టోల్ మోత మోగనుంది. ఇప్పటికే పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో అదనపు భారం పడుతుండగా ఏటా టోల్ పెంచడంతో వాహనాలు తిప్పలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏటా ధరలు ఆకాశాన్నంటుతుండగా, సామాన్యుల వేతనాలు మాత్రం ఇంకా నేలచూపులు చూస్తూనే ఉన్నాయి. ఇలా అయితే రానురాను సామాన్యుడు బతకడమే గగనంగా మారుతుంది. నిజానికి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెరిగే టోల్ చార్జీలు పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెంపు వాయిదా పడింది. పెరిగిన టోల్ చార్జీలు జూన్ 1వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని బీఓటీ పద్ధతిలో విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు జీఎంఆర్ సంస్థ సిద్ధమైంది. జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద ఒక్కొక్కటి చొప్పున మూడు టోల్‌ప్లాజాలను జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్‌ఫీజు వసూళ్లను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల మేరకు ప్రతిఏటా ఏప్రిల్ ఒకటో తేదీన టోల్‌ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు జీఎమ్మార్ సంస్థకు ఎన్‌హెచ్ఏఐ కల్పించింది. అయితే ఈసారి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టోల్ చార్జీల పెంపును ఎన్నికల సంఘం వాయిదా వేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా.. చివరి విడత జూన్ 1న ముగియనుంది. ఆ రోజు అర్ధరాత్రి నుంచి పెరిగిన టోల్ ధరలు అమల్లోకి వస్తాయి.

**నేషనల్ హైవేలపై ఇదీ పరిస్థితి..**

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించడంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న హైదరాబాద్-విజయవాడ (65), హైదరాబాద్-వరంగల్ (163) జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు(నందిగామ), వరంగల్ హైవేపై బీబీనగర్ మండలం గూడూరు వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అయితే పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు దాదాపు 30 వేలకు పైగా, గూడూరు టోల్‌ప్లాజా వద్ద 27వేల వాహనాలకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవికాకుండా రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై నిర్మల్ జిల్లాలో 7, హైదరాబాద్‌లో 11, వరంగల్‌లో 5, ఖమ్మంలో 5 చొప్పున టోల్ ప్లాజాలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మిస్తున్న రోడ్లకు నిర్మాణ వ్యయాన్ని బట్టి నిర్ణీత కాల వ్యవధికి టోల్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు ఎన్‌హెచ్ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) అప్పగించింది.

**5 శాతం పెరిగిన టోల్ ఛార్జీలు..**

తాజాగా యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద పెరిగిన టోల్ చార్జీలు ఇలా ఉన్నాయి. కార్లు, జీపులు, వ్యాన్‌లకు రెండు వైపు ప్రయాణానికి రూ.5, చిన్న భారీ 10 టైర్ల పై10 రూపాయలు పెరిగాయి. వాణిజ్య, భారీ గూడ్స్ లారీలకు 15 రూపాయలు పెంచింది. మొత్తం ఐదు శాతం మేర టోల్ చార్జీలు పెంచినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో అదనపు భారం పడుతుండగా ఏటా టోల్ పెంచడంతో వాహనాలు తిప్పలేని పరిస్థితి ఏర్పడిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్ పెంపుతో అన్ని రకాల ధరలు పెరుగుతాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం టోల్‌ఛార్జీలను 5 శాతం పెంచడంతో ఆ భారాన్ని ఆర్టీసీ ప్రయాణికుల నుంచి వసూలు చేస్తోంది. ఆర్టీసీ విషయానికి కొస్తే.. ఆర్డినరీ నుంచి గరుడ ప్లస్ వరకు బస్సుల్లో ఒక్కో ప్రయాణికుడిపై రూ.4 వరకు పెంచే అవకాశం ఉంటుంది. నాన్ ఏసీ స్లీపర్ బస్సులో 15, ఏసీ స్లీపర్ బస్సులో రూ.20 చొప్పున ప్రయాణికుల నుంచి టోల్‌ఛార్జీ వసూలు చేసే అవకాశాలు లేకపోలేదు. ఇలాగైతే సామాన్యుడు జీవితం గడిసెది ఎట్లానో ఏమో మరి.



# మార్పు మార్పు అంటే ఇప్పుడు ఏమైంది..?

(మొదటిపేజీ తరువాయి)

గతంలో మాపై నిరుద్యోగులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. 10ఏండ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కెళ్ళ 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ వల్ల విద్యార్థులకు,నిరుద్యోగులకు లాభం జరిగిందన్నారు. 3 మెడికల్ కాలేజీలు ఉంటే 33 చేసినమన్నారు. బోనస్ కాస్త బోగస్ అయిందన్నారు.గత ఎన్నికల్లో సోషల్ మీడియాలో మాపై దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ఇచ్చింది మేము, ఉద్యోగాలు ఇచ్చింది మేమైతే 30వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకీ జాబ్ కేలండర్ ఎక్కడ..? నిరుద్యోగులు మళ్ళీ మోసపోకండని సూచించారు. మెగా డీఎస్సీ దగా డిఎస్సీ అయ్యిందన్నారు. టెట్ పరీక్షకు రూ. 400 ఉండేది ఇప్పుడు రూ.1000 అయ్యిందన్నారు. రాకేష్ రెడ్డి ఉన్నత విద్యావంతుడు, బిట్స్ ఫిలానిలో చదువుకున్నాడన్నారు. అమెరికాలో ఉద్యోగం వదిలి ప్రజాసేవ కోసం వచ్చిన వ్యక్తి అని గుర్తు చేశారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉండాలన్నారు. మల్లన్నవి కేవలం బ్లాక్ మెయిల్ దందాలు మాత్రమే. 56 కేసులు అంటున్నడు అవి అన్ని నిరుద్యోగుల కోసమో, ఉద్యోగులకోసమో కాదు స్వలాభం కోసం మాత్రమే అని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఓట్లు ఆలోచించి ఓటు వేయాలన్నారు. రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

**మీ బిడ్డగా కోరుతున్న.. రాకేష్ రెడ్డిని గెలిపించండి**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ గవర్నమెంట్ లో నర్సంపేట నియోజకవర్గానికి వచ్చిన నిధులతో అభివృద్ధి ముందుకు సాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే గెలవాలన్నారు. నిరుద్యోగుల్ని నష్టపరిచేలా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని ఖండించాలని పిలుపునిచ్చారు. నర్సంపేట నియోజకవర్గం 'ఎడ్యుకేషన్ హబ్' గా అభివృద్ధికి సహకరించిన కేసీఆర్, కేటీఆర్ గారికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నర్సంపేట నియోజకవర్గానికి మెడికల్ కాలేజీని తీసుకువచ్చిన బిడ్డగా నేను మిమ్మల్ని కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు.

# తిరుమలలో సత్రాలు, కల్యాణ మండపం నిర్మిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. దర్శన ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించారు. దర్శనం అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి తిరుమల శ్రీవారిని దర్శించుకోవటం జరిగిందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి వైపు పయణించాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడబోయే ప్రభుత్వం, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో తెలంగాణ ముఖ్యమంత్రిగా సత్సంబంధాలతో సమస్యలన్నింటిని పరిష్కరించుకొని కలిసికట్టుగా రెండు రాష్ట్రాలు ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుమలలో సత్రాలు, కల్యాణ మండపం నిర్మించి తెలంగాణ నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో భాగస్వామ్యం తీసుకోవాలని భావిస్తున్నామని, ఈ మేరకు త్వరలోనే ఏపీ సీఎంను కలిసి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రైతులు సంతోషంగా ఉన్నారు. నీటి సమస్యలుతీరి సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని రేవంత్ పేర్కొన్నారు.

# దొడ్డు వడ్లు కొనేందుకు కేంద్రం సిద్ధం

**టీ సర్కార్‌పై కేంద్రమంత్రి, టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఫైర్**

**విశ్వంభర, హైదరాబాద్ :** దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని... అలాంటప్పుడు వాటిని కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? అని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ నేతలు రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి... ఆ తర్వాత పంద్రాగస్ట్ అంటున్నారని మండిపడ్డారు. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పారని... కానీ సన్నరకం వడ్లకే అని ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80 శాతం దొడ్డు వడ్లనే పండిస్తారన్నారు. చాలా తక్కువమంది రైతులే సన్నరకం పండిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ పేరుతో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు, ప్రభుత్వానికి కేంద్రం అన్ని రకాలుగా అండగా ఉంటోందన్నారు. రబీ సీజన్‌లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించడానికి కేంద్రం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. ధాన్యం తడిసినా... కొనుగోలు కేంద్రాలకు తరలించి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మార్కెట్ యార్డుల వద్ద అన్నదాతలు పడికాపులు కాస్తున్నారన్నారు. మంగళవారం 75 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని... పరిస్థితి ఇలాగే ఉంటే కొనేందుకు మరో 2 నెలలు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# జాతీయ స్థాయిలో భట్టి మార్క్

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భట్టి ప్రచారం
- అభ్యర్థుల గెలుపునకు తిరుగులేని వ్యూహాలు
- పలు రాష్ట్రాల్లో భట్టికి బాధ్యతలు అప్పగించిప ఏఐసీసీ
- అధిష్టానం మెప్పు పొందిన ఉప ముఖ్యమంత్రి

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన మార్కును జాతీయ స్థాయిలో వేశారా?? అంటే అవుననే సమాధానం వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. తరువాత దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు వ్యూహాలు పన్నుతూ.. విస్తృత ప్రచారం చేస్తున్నారు. అణువణువునా కాంగ్రెస్ భావజాలం, అధినాయత్వంపై విధేయత, పార్టీపై అంకిత భావం కలిగిన నాయకుడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. రాష్ట్రంలోనూ 2014 నుంచి తిరిగి అధికారంలోకి వచ్చే వరకూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన అనుసరించిన వ్యూహాలు.. ఎత్తుగడలు, పోరాటాలు.. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీని శక్తివంతం చేశాయి. మరీ ముఖ్యంగా ప్రజల కోసం రాహుల్ గాంధీ సందేశాన్ని రాష్ట్రంలోని ప్రతి గడపకు తీసుకువెళ్లేందుకు ఆయన చేసిన పాదయాత్ర.. సరికొత్త చరిత్రనే లిఖించింది. ఆయన శక్తియుక్తులు, వ్యూహ సామర్థ్యంపై బలమైన అంచనాకు వచ్చిన పార్టీ అధినాయకత్వం.. ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించాలని ఆదేశించింది. ఒరిస్సాలో నాలుగైదు దఫాలుగా ప్రచారం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి.. తాజాగా పంజాబ్ లో ఎన్నికల ప్రచారం కోసం వెళ్లారు. పార్టీ కార్యకర్తలు, నాయకత్వంతో మెరుగైన సమన్వయం, ఎన్నికల నిర్వహణ పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ పార్లమెంటు నియోజకవర్గం ప్రత్యేక పరిశీలకుడిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్ ను ఏఐసీసీ నియమించింది. ఫరీద్ కోట్ పార్లమెంటు నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడిగా వెళ్లిన భట్టి విక్రమార్క.. మూడు రోజులపాటు స్థానికంగా ప్రచారం చేస్తారు.. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయనున్నారు.

# దేశంలో మళ్లీ కరోనా విజృంభణ

- కొత్తగా నమోదవుతున్న కేసులు
- కేపీ-134, కేపీ-2 వేరియంట్ 290 కేసులు నమోదు
- భయపడాల్సిన అవసరం లేదన్న కేంద్ర ఆరోగ్య శాఖ
- ఈ కొత్త వేరియంట్లు ప్రాణాంతకం కాదని వెల్లడి

**విశ్వంభర, ఢిల్లీ :** దేశంలో కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. కొత్త కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కొత్త వందల సంఖ్యలో ఈ మహమ్మారి కేసులు నమోదువున్నాయి. దీంతో సర్వాత్ర కలకలం సృష్టిస్తుంది. భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన బులిటెన్ ప్రకారం.. దేశంలో కేపీ-1, కేపీ-2 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇందులో కేపీ-134 కేసులు, కేపీ-2 వేరియంట్ 290 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ కొత్త వేరియంట్లతో భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇవి మరీ అంత ప్రాణాంతకం కాదని తెలిపింది. కానీ.. జాగ్రత్తగా ఉండాలని సూచించింది. దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో కరోనా విజృంభణ మొదలైంది. చాలా దేశాల్లో కొత్త కేసులు వేల సంఖ్యలో నమోదవుతున్నాయి. కొన్ని దేశాల్లో హెల్త్ ఎమర్జెన్సీ కూడా ప్రకటిస్తున్నారు. ప్రపంచం మొత్తం కనుమరుగైన కరోనా తాజాగా సింగపూర్ లో కకావికళం చేస్తోంది. గత వారం రోజుల్లో ఆ దేశంలో 25,900 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ దేశానికి వెళ్లి వస్తున్న వారిపై ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండాలని సూచించాయి. మూడేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని ఈ మహమ్మారి వణికించింది. అప్పట్లో భారత్‌లో చాలా మంది ప్రాణాలు పిట్టల్లా రాలాయి. రోజు 50 వేల కేసులు నమోదయ్యాయి. ఆస్పత్రులు మొత్తం కరోనా రోగులతోనే నిండిపోయాయి. అయితే ఆతర్వాత నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. కానీ మళ్లీ కొత్త కేసులు నమోదవడం ఆందోళనకరంగా మారింది.

# ఎక్స్‌లో ఇకపై సినిమాలు, సీరియల్స్

- పోస్ట్ చేసుకోవచ్చని ప్రకటించిన ఎలాన్ మస్క్
- మానిటైజ్ చేసుకొని డబ్బులు సంపాదించుకోవచ్చని సూచన
- ఎలాన్ మస్క్‌కు పలు సూచనలుచేసిన నెటిజన్స్

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్ ఫారం ఎక్స్ అధినేత మస్క్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎక్స్‌లో కూడా సినిమాలు సినిమాలు పోస్టు చేసుకోవచ్చిన తెలిపారు. సబ్‌స్క్రైబర్లు తన సినిమాలను, టీవీ సీరియల్స్‌ను పోస్టు చేసుకోవచ్చని తెలిపారు. వాటిని మానిటైజ్ చేసుకొని దాని ద్వారా డబ్బు కూడా సంపాదించుకోవచ్చని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఆయన ప్రకటనపై ట్విట్టర్ యూజర్ల నుంచి మంచి స్పందన వస్తోంది. సినిమాలను చూసుకునే అవకాశం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే కాకుండా యూజర్లు అందరికీ వీలు కల్పించాలని అన్నారు. ఒక్కసారి ఫీజు చెల్లిస్తే సినిమాలు చూసుకునేలా అవకాశం ఉండేలా చేయాలన్నారు. అప్పుడు ఎక్స్ నిజమైన సినిమా వేదిక అవుతుందని అంటున్నారు. అంతేకాదు.. ఎక్స్‌కు మెరుగైన వీడియో ప్లేయింగ్ యంత్రాంగం అవసరమని మరో యూజర్ సూచించారు. ఇక మస్క్ మరో ప్రకటన కూడా చేశారు. త్వరలో ఏఐ ఆడియెన్సెస్ అనే మరో ఫీచర్‌నూ పరిచయం చేయనున్నామని చెప్పారు. ప్రకటనలను సరైన యూజర్లకు చేరవేయటం కోసం దీన్ని తీసుకొని వస్తున్నామని అన్నారు. సంచలనాలకు మారు పేరుగా మస్క్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ కొనుగోలు చేసిన తర్వాత సంచలన మార్పులు చేస్తూనే ఉన్నారు. దాని పేరును ఎక్స్ అని మార్చడం మొదలు... ఉద్యోగులకు పెద్దఎత్తున లే ఆఫ్‌లు ఇచ్చారు. ఇలా తీసుకున్న ప్రతీ నిర్ణయం పెద్ద చర్చకు దారి తీసేలా చేశారు.



# మేడిగడ్డకు నిపుణుల కమిటీ

- ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ముగ్గురు సభ్యుల టీం
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలూ సందర్శన
- బ్యారేజీలో జరుగుతున్న తాత్కాలిక రిపేర్ల పరిశీలన
- నేడు జలసౌధలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీతో భేటీ

**విశ్వంభర, హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజ్‌ను సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిపుణుల బృందం సందర్శించింది. పూణే నుండి జీఓ ఫిజికల్ ఇన్విస్టిగేషన్ అధికారి ధనుంజయ నాయుడు, జియో టెక్నికల్ ఇన్విస్టిగేషన్ అధికారి జె.ఎస్.ఎడ్ల బడ్కర్, జియో నాన్ డిస్ట్రాక్టివ్ టెస్ట్ అధికారి ప్రకాష్ తాలేలు.. మొత్తం ముగ్గురు నిపుణులతో కూడిన టీం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పరిశీలించింది. తొలుత మేడిగడ్డ దగ్గర జరుగుతున్న బ్యారేజీ పనులను పరిశీలించారు. తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా పరిశీలించారు. గురువారం జలసౌధలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇరిగేషన్ సెక్రటరీలతో నిపుణుల కమిటీ సమావేశం కానుంది. మేడిగడ్డ బ్యారేజీలో తాత్కాలిక రిపేర్లు పనులు జరుగుతున్నాయి. పనులు మరింత వేగవంతం చేయడానికి నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. దెబ్బతిన్న, కుంగిన ఏడో బ్లాక్‌లో మొత్తంగా 11 గేట్లు ఉండగా, ఇందులో ఎనిమిది గేట్లు మూసి ఉన్నాయి. ఆనకట్ట పునరుద్ధరణ చర్యల్లో భాగంగా ఆ బ్లాక్‌లోని 15వ గేట్‌ను శుక్రవారం ఎత్తగా, మిగిలిన ఏడు గేట్లను ఎత్తడానికి పనులు చేస్తున్నారు. వరద ప్రవాహానికి కొట్టుకపోయి, చెల్లాచెదురుగా ఉన్న సీసీ బ్లాక్ అమరిక, స్యాండ్ గ్రౌటింగ్ పనులు సాగుతున్నాయి. వర్షాకాలంలో వరదను తట్టుకునేలా ఏడో బ్లాక్ ప్రాంతంలో షీట్ ఫైల్స్ ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 16వ గేట్‌ను కూడా ఎత్తితే ఏర్పడే ఇబ్బంది, సాధ్యాసాధ్యాలను నిపుణుల కమిటీ పరిశీలించింది. రేపు దీన్ని ఎత్తే అవకాశం ఉంది. ఈ గేటును ఎత్తితే మరమ్మతులు మరింత వేగవంతం అవుతాయి. రేపు జలసౌధలో ఏర్పాటు కానున్న మీటింగ్ తర్వాత గేట్లు ఎత్తివేతపై ఓ క్లారిటీ వస్తుంది.

# రేషన్.. వెరీ స్మార్ట్

(మొదటిపేజీ తరువాయి)

**పాత, కొత్త కార్డ్స్ ఇలా..**

రాష్ట్ర వ్యాప్తంగా 89 లక్షల 98 వేల 546 ఆహార భద్రత కార్డులున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డు ఓ చిన్న పుస్తకంలా ఉండేది. అందులో కుటుంబ యజమాని ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు, వయసు వివరాలు ఉండేవి. ఆ తర్వాత వీటి స్థానంలో రైతుబంధు పాస్‌బుక్ సైజ్‌లో రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. ముందువైపు కుటుంబ సభ్యుల గ్రూప్ ఫొటో, కింద కుటుంబ సభ్యుల వివరాలు.. వెనుకవైపు చిరునామా, ఇతర వివరాలు ఉండేవి. ఆ తర్వాత రేషన్‌కార్డుల స్థానంలో ఆహార భద్రత కార్డులు వచ్చాయి. ఒక పేజీతో ఒకవైపే ఉండే ఈ కార్డులో యజమాని, కుటుంబ సభ్యుల ఫొటో ల్లేకుండా.. కార్డుదారు, కుటుంబ సభ్యులు, రేషన్ దుకాణం, కార్డు సంఖ్య మాత్రమే ఉన్నాయి. కొత్తగా విడుదల చేయనున్న రేషన్ కార్డులు ఎలా ఉండాలనే విషయంపై తర్వాతలో చర్చించనున్నారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది. కాబట్టి ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత ప్రభుత్వం దీనిపై చర్చించి కీలక ప్రకటన చేయనుంది.

# ఇండియా కూటమి క్యాన్సర్ కంటే ప్రమాదకారి

(మొదటిపేజీ తరువాయి)

మోదీ దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది పేదలకు ఇళ్ళు ఇచ్చారని, ఇప్పుడు సమాజ్‌వాది, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే అన్నింటినీ తారుమారు చేస్తారని హెచ్చరించారు. విపక్షాలు గెలిస్తే పేదలకు తాము నిర్మించిన ఇళ్లను గుంజుకుని వాటిని తమ ఓటు బ్యాంకుకు పంచివేస్తాయని ఆరోపించారు. తాను ప్రారంభించిన 50 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలను మూసివేసి ఆ డబ్బును వారు లాగేసుకుంటారని విమర్శించారు. మోదీ ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తే విపక్షాలు విద్యుత్ కనెక్షన్లను కట్ చేసి మళ్లీ చీకట్లోకి తీసుకువెళతాయన్నారు. బీజేపీ ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తే... విపక్షాలు మీ ఇంటి పంపుల నుంచి నీటిని తీసుకువెళతాయని హెచ్చరించారు. ప్రజల కోసం 60 ఏళ్లుగా ఏమీ చేయని వారు మోదీని నిలువరించేందుకు ఏకమయ్యారన్నారు. యూపీలో అదే పాత ఫ్లాప్ సినిమాతో అదే పాత క్యారెక్టర్లు, పాత డైలాగ్‌లతో ఇద్దరు వారసత్వ నేతలు బయలుదేరారని ఎద్దేవా చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించబోవన్నారు.

# బాలికపై రాపిడో డ్రైవర్ అత్యాచారం

**యువకుడిపై తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**విశ్వంభర, హైదరాబాద్ :** రోడ్డుపై ఒంటరిగా వెళుతున్న బాలికకు ర్యాపిడో డ్రైవర్ మాయ మాటలు చెప్పిలాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తుకారం గేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుకారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కుటుంబం నివాసం ఉంటుంది. తరుచూ ఫోన్లో మాట్లాడవద్దని తల్లిదండ్రులు కుమార్తె(16)కు చెప్పారు. ఇలా చాలాసార్లు చెప్పి మందలించాలని చూశారు. కానీ ఈ నెల 19న ఆ బాలిక ఫోన్‌లో మాట్లాడతుండగా తల్లిదండ్రులు వద్దని చెప్పి మందలించారు. దీంతో ఆమె అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అదే రోజు తల్లిదండ్రులు తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో తమ కుమార్తె తప్పిపోయిందని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. హబ్సిగూడలో వర్కింగ్ మెన్ హాస్టల్‌లో ఉండే సందీప్ రెడ్డి(28) వృత్తిరీత్యా రాపిడో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతడు తన విధుల్లో ఉన్న సమయంలో రోడ్డుపై ఆ బాలిక ఒంటరిగా వెళ్లడం గమనించాడు. వెంటనే ఆమె వద్దకు వెళ్లి ఎక్కడికి వెళుతున్నావని అడిగాడు. అలా బాలికను మాయమాటల్లో పెట్టిన ఆ కేడీ తనను ఆ వాహనంపై ఎక్కించుకున్నాడు. అక్కడి నుంచి కూకట్‌పల్లి, కొండాపూర్, ట్యాంక్‌బండ్ వంటి తదితర ప్రాంతాలకు తిప్పాడు. అనంతరం కాచిగూడలోని ఓ లాడ్జికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. అక్కడ లాడ్జిలో బాలికపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బాలిక భయపడి వెంటనే తన ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## పీవోకే భారత్‌లో అంతర్భాగమే..
# స్వాధీనం చేసుకోండి

- ఎన్నికల సమయంలోనే ఈ అంశం తెరపైకి..?
- పదేళ్లలో పీఓకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?
- యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో బీజేపీపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్ :** పీవోకే భారత్‌లో అంతర్భాగమని తాము కూడా చెబుతున్నామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే అంటున్నామన్నారు. కానీ బీజేపీ ఎన్నికల సమయంలోనే ఈ అంశాన్ని తెరపైకి ఎందుకు తీసుకువస్తోంది అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు పీవోకే గురించి పదేపదే మాట్లాడుతున్నారని... ఈ పదేళ్లలో పీఓకేను స్వాధీనం చేసుకునేందుకు వారేం చేశారో చెప్పాలని నిలదీశారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 400 స్థానాలకు పైగా గెలుస్తామని ప్రారంభంలో చెప్పినట్లుగా ఇప్పుడు బీజేపీ చెప్పడం లేదన్నారు. పెట్రోల్ ధరలు రూ.100 దాటాయని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ బరిలో ఉన్న వారణాసిలో పేపర్ లీక్‌ల ఘటనల వంటి వాస్తవ అంశాలను బీజేపీ మరుగునపడేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.




## టీఎన్జీవోస్ నేత ముజీబ్‌కు ఘన సన్మానం

**విశ్వంభర, బషీర్ బాగ్ :** టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ఎం హుస్సేని ముజీబ్ ను టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ప్రతిపాదించాలని టిఎన్జీవోస్ నాయకులు కోరారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన అన్ని యూనిట్ ఉద్యోగులందరూ మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ముజీబ్‌కు అన్ని శాఖల యూనిట్లు సంపూర్ణ మద్దతు ఉన్నట్టు టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఎం.జగదీష్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సెక్రెటరీ ఎం.భాస్కర్ తెలిపారు. సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు ఆయన అధికారాలను ఉపయోగించి ముజీబ్‌ను కో ఆప్ట్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముజీబ్‌ను టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సెక్రటరీ ఎం.భాస్కర్, డేవిడ్ లు ఇతర యూనిట్ల నాయకులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ప్రేమ్ కిమార్, బి.రవి, ముక్తాదర్, రవి, ప్రియదేవ్ ఠాకూర్, ముజాహిద్ అలీ, విక్రమ్ కుమార్, కోశాధికారి బాల్‌రాజ్, ఒమర్ ఖాన్, కె.శ్రీనివాస్, నరేష్ కుమార్, ఖలీద్ అహ్మద్, ముజీబ్, సుజాత, గీత, వైదిక్ శాస్త్రీ, హరిబాబు, బి.శంకర్, శ్రీధర్, ముఖీద్, వెంకట్ రెడ్డి, జానకి, జహంగీర్, వహీద్, ప్రభాకర్, దేవేందర్, వెంకటేష్, కుతుబుద్దీన్, ఆర్.కృష్ణ, ఈఎస్ఐ రాజ్ కుమార్, జాఫ్రీ, ఈఎన్‌టీ రాజు, రాజేందర్, నర్సింహాచారి, లక్ష్మణ్, కుమార్ రహీం, లక్ష్మి, సుధీర్, ధనరాజ్ పాల్గొన్నారు.



## విజ్ఞానవంతుడినే గెలిపించాలి

- ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీలు మోసగించిన పార్టీలే
- కాంగ్రెస్ పై యువతకు వ్యతిరేకత మొదలైంది
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

**విశ్వంభర, సూర్యాపేట మే 22:** ఈ నెల 27న జరుగనున్న నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యతో పాటు విజ్ఞానవంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డినే గెలిపించాలని మాజీమంత్రి, శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ తో కలిసి మాజీమంత్రి జగదీశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో ప్రశ్నించే గొంతుక, ఉన్నత విద్యావంతుడు, సమస్యలపై పోరాడేతత్వం ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఇన్నేళ్ళుగా ప్రశ్నించే గొంతుక అన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మోసగించే గొంతుకగా మారాడని ఎద్దేవా చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్ ముసుగులో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డ మల్లయ్య బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. ఇక కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే కనపడి తరువాత అడ్రస్ కూడా లేకుండా పోయే బీజేపీ అభ్యర్థిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు యువతను మోసగించిన పార్టీలే అన్నారు. ప్రస్తుతం యువతలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత మొదలయిందన్నారు. ఈ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డికి అత్యధిక మెజార్టీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత తమ తెలివైన, విలువైన ఓటును బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి వేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## అత్యంత ఆదరాభిమానాలను
# పంచిన కర్మభూమి నల్లగొండ

- ఈ నేలను ఎప్పటికీ మరువలేను
- వీడ్కోలు సభలో ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి



**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** అత్యంత ఆదరాభిమానాలను పంచిన కర్మభూమి నల్లగొండ అని, ఈ నేలను ఎప్పటికీ మరువలేమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా అభివృద్ధి పథంలో నడిపి పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డికి సిబ్బంది, కళాశాలల యాజమాన్యాలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో జరిగిన వీడ్కోల సమావేశంలో సిబ్బంది కళాశాలల యాజమాన్యాలు ఆచార్య గోపాల్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని వారి సేవలను కొనియాడారు. అనంతరం గోపాల్ రెడ్డి దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండతో తన అనుభవాన్ని పంచుకున్నారు. పీజీ సెంటర్ అధ్యాపకుడిగా ప్రారంభించిన తన ప్రస్థానం అత్యున్నత అకాడమిక్ పదివేల ఉపకులపతి సైతం నల్లగొండతోనే ముడిపడటం యాదృచ్ఛికం అత్యంత అదృష్టంగా భావిస్తా అన్నారు. కర్మభూమి నల్లగొండ జిల్లా ఆదరణ ప్రేమాభిమానాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అన్ని సానుకూలతలు ఉన్నట్లు, సిబ్బంది కొరత అధిగమించి కొత్త కోర్సులను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోనే ఉన్నత విద్యలో అగ్రగామిగా నిలవచ్చునన్నారు. రాబోవు రోజుల్లో ఉష, రూస నిధులతో నూతన హాస్టల్స్ భవనాలు, పరిపాలన భవనాలకు సైతం అనుమతులు పొందినట్లు తెలిపారు. విద్యార్థులతో స్నేహపూర్వక అనుబంధం ఎన్నో గుణాత్మకమైన మార్పులకు బాట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈ మూడేళ్ల పదవి కాలంలో తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఓఎస్‌డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, ఎంవి గోన రెడ్డి, కృష్ణారెడ్డి, కంట్రోలర్ డా జి ఉపేందర్ రెడ్డి, దోమల రమేష్, ప్రేమ్ సాగర్ మద్దిలేటి, అరుణప్రియ, సుధారాణి, మిరియాల రమేష్, వై ప్రశాంతి, ఆకుల రవి, సూర్యనారాయణ రెడ్డి, రేఖ, అన్నపూర్ణ, తదితర అధ్యాపకులు, విద్యార్థులు, నేషనల్ ఎలక్షన్ వాచ్ ప్రెసిడెంట్ బొమ్మరబోయిన కేశవులు పాల్గొన్నారు.

## మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్?

- సంగారెడ్డిలో అరెస్ట్ చేసిన ఏపీ పోలీసులు
- కారును ఛేజ్ చేసి పట్టుకున్న తెలంగాణ పోలీసులు
- ఉదయం నుంచి రెండు రాష్ట్రాల్లో నడిచిన హైడ్రామా
- ఇస్నాపూర్‌లోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో అరెస్ట్
- ఈవీఎం ధ్వంసం ఘటనలో అరెస్ట్‌కు ఆదేశం ఇచ్చిన ఈసీ

**విశ్వంభర, సంగారెడ్డి :** ఏపీలో ఈవీఎం విధ్వంసం కేసులో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలోని సంగారెడ్డి సమీపంలో ఎమ్మెల్యే పిన్నెల్లిని అరెస్టు చేసినట్లు సమాచారం అందుతోంది. ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో అరెస్టు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం పిన్నెల్లి సోదరులు ఏపీ పోలీసుల అదుపులో ఉన్నారు. ఇస్నాపూర్ లోకేషన్ గురించి పటాన్‌చెరు పోలీసులను అడిగిన ఏపీ పోలీసులు ఇస్నాపూర్ వరకు తెలంగాణ పోలీసుల సహకారం తీసుకొని పిన్నెల్లిని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లి కోసం ఉదయం నుంచి గాలించిన పోలీసులు ఆయనను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. పోలీసుల గాలింపు విషయం తెలుసుకున్న పిన్నెల్లి వారి కళ్లుగప్పి పరారయ్యేందుకు విఫల యత్నం చేశారు. మాచర్ల ఘటనపై ఆగ్రహంగా ఉన్న ఈసీ, పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని ఇప్పటికే ఆదేశించింది. ఈసీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో పిన్నెల్లి సోదరులను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లిపై పది సెక్షన్లతో కేసులు నమోదు చేసినట్లు, ఏపీ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. మొత్తం 3 చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై కేసులు పెట్టినట్లు పేర్కొన్నారు. ఐపీసీ, ఆర్పీ, పీడీపీపీ చట్టాల పరిధిలో పది సెక్షన్లు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఐపీసీ కింద 143, 147, 448, 427, 353, 452, 120బి సెక్షన్ల కింద కేసులు చేమన్నారు. ఇక పిన్నెల్లిపై పీడీ పీపీ చట్టం కింద మరో కేసు నమోదు నమోదు చేశారు. ఆర్పీ చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. ఈవీఎం ధ్వంసం ఘటన వెలుగులోకి రావడంతో ఈనెల 20న పిన్నెల్లిపై కేసు నమోదు చేసిన పోలీసులు నేడు ఆయనను అరెస్ట్ చేశారు.

### తెలంగాణ పోలీసుల సహకారం

ఈవీఎం ధ్వంసం కేసు వెలుగులోకి రాగానే పిన్నెల్లి సోదరులు హైదరాబాద్ పారిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈమేరకు వారిని అరెస్ట్ చేయడనికి ఏపీ పోలీసులు తెలంగాణ పోలీసుల సహకారం తీసుకున్నారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. పల్నాడు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. పిన్నెల్లి తెలంగాణలోని సంగారెడ్డి వైపు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సంగారెడ్డి జిల్లా కంది వద్ద పిన్నెల్లి కారును స్వాధీనం చేసుకున్నారు. పిన్నెల్లి కాన్వాయ్‌ను పల్నాడు పోలీసులు వెంబడించారు. పోలీసుల కళ్లుగప్పి పిన్నెల్లి మరో కారులో పరారయ్యారు. ఎట్టకేలకు ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.




## పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్సై మొదటి భార్య ధర్నా

**విశ్వంభర, సిద్దిపేట :** విడాకులు ఇవ్వాలని చెప్పి భర్త తనపై వేధిస్తున్నాడని ఓ ఎస్ఐ భార్య పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగింది. వేరొక మహిళతో అక్రమ సంబంధం కారణంగానే తన భర్త విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నాడని ఆరోపిస్తూ సదరు ఎస్ఐ మొదటి భార్య పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో జరిగింది. ఎస్ఐ మొదటి భార్య తెలిపిన సమాచారం ప్రకారం తన భర్త అయిన కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు రెండేళ్ల క్రితం మరో అమ్మాయిని అక్రమంగా వివాహం చేసుకున్నాడని అతడి మొదటి భార్య మానస ఆరోపించారు. ఏడాది క్రితం తనతో పాటు పిల్లలనిద్దరినీ కరీంనగర్‌లోని ఓ అద్దెకు ఓ ఇళ్లు తీసుకొని కానిస్టేబుల్‌ను కాపలాగా ఉంచాడని ఎస్ఐ భార్య మానస తెలిపింది. విడాకులు ఇవ్వాలని గత రెండు నెలలుగా తనపై చిత్రహింసలకు గురిచేశాడని ఆమె ఆరోపించారు. కనీసం పిల్లలను కూడా తన వద్ద ఉంచకుండా భర్త ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆమె తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రమేయంతోనే తన భర్త రెండో వివాహం చేసుకున్నారని మానస ఆరోపించారు. కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ గురించి అడగ్గా ఆయన సెలవులో ఉన్నారని చెప్పారన్నారు. జిల్లా పోలీసు అధికారులను సంప్రదించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని మానస ఆరోపించారు. ఇప్పటికైనా తన పిల్లలను అప్పగించి తనకు న్యాయం చేయాలని ఎస్ఐ భార్య డిమాండ్ చేశారు. తనకు తన భర్త, పిల్లలు కావాలని ఎస్ఐ భార్య తెలిపారు.

## బోయిన్‌పల్లిలో లిక్కర్ లారీ బోల్తా



**విశ్వంభర, బోయిన్‌పల్లి :** హైదరాబాద్ బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలోని డెయిరీ ఫాం ప్రధాన రహదారిపై మద్యం లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. టైర్ పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం బోల్తా కొట్టగా అందులో ఉన్న లిక్కర్ బాటిళ్లు చాలావరకు కిందపడి పగిలిపోయాయి. దాదాపు రూ. 3 లక్షల విలువైన లిక్కర్ బాటిళ్లు ధ్వంసం అయినట్లు అంచనా వేస్తున్నారు. కాగా లారీ అలా బోల్తా కొట్టిందో లేదో మద్యం ప్రియులు అలా పట్టేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారులు మద్యం బాక్సులను చూసి వెంటనే తమ వెహికల్స్‌ను ఆపారు. రోడ్డుపై పడిన లిక్కర్ బాటిళ్లను అందినకాడికి ఎత్తుకెళ్లారు. ఇలాంటి బంపర్ ఆఫర్ మళ్లీ రాదని తలచి బాటిళ్లకు బాటిళ్లు పట్టుకెళ్లారు. ఘటన స్థలికి చేరుకున్న బోయిన్‌పల్లి పోలీసులు, ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా వాహనాన్ని అక్కడి నుంచి తొలగించారు.

## పంచాయతీరాజ్ ఏఈ సస్పెండ్

**విశ్వంభర, కొడిమ్యాల :** కొడిమ్యాల మండలంలో పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న టీ.చంద్రశేఖర్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ లో టీ.చంద్రశేఖర్ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గల 21 పోలింగ్‌బూత్‌లకు సెక్టోరియల్ ఆఫీసర్ గా అపాయింట్ అయ్యారు. అయితే సెక్టార్ ఆఫీసర్ గా విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని ఏఈ చంద్రశేఖర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు వెలువరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేసిన కలకత్తా హైకోర్టు

**విశ్వంభర, కలకత్తా :** కలకత్తా హైకోర్టు బుధవారం సంచలన తీర్పు ఇచ్చింది. 2010 తర్వాత జారీ అయిన ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. 2012 నాటి పశ్చిమ బెంగాల్ వెనుకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసులకు ఓబీసీ కింద జారీ చేసిన సర్టిఫికెట్లన్నింటిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనుకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు... ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది.


## రైతులను అందుబాటులో సబ్సిడి విత్తనాలు

**విశ్వాంభర, షాద్ నగర్ మే 22:** ఫరూక్ నగర్ మండల రైతులకు గురువారం నుంచి మండలంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం 2, కేశంపేట్ రోడ్ లో ప్రభుత్వం 60% రాయితీపై జనుము 40 క్వింటాలు (100బస్తాలు), జీలుగ 17.60క్వింటాలు( 58 బస్తాలు), పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కావలసిన రైతులు పట్టా పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా వ్యవసాయ అధికారిని సంప్రదించాలి. ఒక్కో రైతుకు 5 ఎకరాలకు (2బస్తాలు) మాత్రమే సబ్సిడీపై ఇవ్వబడునని మండల వ్యవసాయాధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

## అంగట్లో ఆడబిడ్డ...
### ఖరీదు 4.50 లక్షలు...
### ఆర్ఎంపీతో సహా ముఠా అరెస్ట్...

**విశ్వంభర, మేడిపల్లి:** 3 నెలల పసికందును అమ్ముతున్న ముఠా ని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది, సభ్యసమాజం తలదించుకునేలా చేశారు కొందరు మహిళలు, వీరు ఆడబిడ్డలే అన్నది మరిచారో ఏమో, అంగట్లో ఆడబిడ్డను అమ్మకానికి బేరం పెట్టారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వీరి గుట్టు రట్టయ్యింది, అక్షర జ్యోతి ఫౌండేషన్ కి చెందిన మహిళలు తమకు ఆడపిల్ల కావాలని స్ట్రింగ్ ఆపరేషన్ చేయగా.. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రామకృష్ణ నగర్ లో శోభా రాణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లో ఆర్ ఎం పీ వైద్యురాలు ఈ పని చేస్తుందని ఆమెని సంప్రదించారు. అమ్మాయిని 4.50( నాలుగున్నర) లక్షలకు ఇప్పిస్తానని ఫోన్ ద్వారా చెప్పడంతో ముందుగా 10 వేలు అడ్వాన్స్ గా చెల్లించి, బుధవారం నాడు పాప కోసం వారు క్లినిక్ కు రాగ వేరే మహిళా అక్కడకు ఓ పాపతో వచ్చి వీరికి అప్పగించారు. దీంతో సంస్థ మహిళలు పోలీసులకు, మీడియా కు ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. పోలీసులు చేరుకుని వీరందరిని పోలీస్ స్టేషన్కు విచారణ కోసం తరలించారు. పేద కుటుంబం పిల్లలను పోషించడం భారమని తల్లి చెప్పడంతో మానవత్వంతో అమ్మాయిని పిల్లలు లేనివారికి అమ్మాను అని శోభ రాణి చెప్పడం కోసమేరుపు. శోభారాణి ఇంకా కొన్ని హాస్పిటల్ పేర్లు, చిలకనగర్ లో మరో మహిళా ఆర్ ఎం పీ, మ్యారేజ్ బ్యూరో మహిళా పేర్లను వారి వివరాలను కూడా తెలియజేసినట్టు సమాచారం. వీరందరు కలిసి ఈ పని చేసినట్లు తెలియజేసింది.

# ప్రత్యేక రాష్ట్రంలో సాధించిందేమిటి?




– బి.ఎస్. రాములు, సామాజిక తత్వవేత్త, రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏండ్లవుతున్నది. పదేళ్ళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిందేమిటి? జరిగిన పరిణామాలేమిటి? ప్రభుత్వాలు, పార్టీలు, సామాజిక వర్గాలు మొదల్కెనవి సమీక్షించుకోవడం ద్వారా వర్తమాన కర్తవ్యాలను నిర్దేశించుకోవాల్సి ఉన్నది. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన ఉద్యమాలు, ఉద్యమాల్లో పాల్గొన్న ప్రజలు, వారి ఆశలు ఏ మేరకు నెరవేరాయి? ఇకనుంచి తీసుకోవాల్సిన కార్యక్రమాలు, పథకాలు ఏమిటి?**

1996 నుంచి వేగం పుంజుకున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనేక మలుపులు తిరిగింది. అనేక పాయలను కలుపుకొని మహా ప్రవాహంగా ముందుకు సాగింది. విభిన్న సామాజిక వర్గాలు రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా ఒక్కట్కై ముందుకు సాగాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014 జూన్ 2వ తేదీన ఏర్పడడంతో అన్ని వర్గాలకు ఎన్నో ఆశలు, ఉత్సాహం, సంతోషం కలిగింది. టి.ఆర్.ఎస్. నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ఆ పథకాలు, కార్యక్రమాల లిస్టులో 425కి పైగా వివిధ పథకాలు పేర్కొనబడ్డాయి. కాని కొన్ని పథకాలే ప్రభుత్వానికి, ప్రజలకు గుర్తుండిపోయాయి. వాటిలో ప్రధానమైనవి కింద పేర్కొనబడ్డాయి.

### గుర్తుండిపోయిన బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు

1) కొత్త జిల్లాల, మండలాల ఏర్పాటు, 2) గురుకుల పాఠశాలల ఏర్పాటు, 3) ఆసరా పథకం, 4) డబుల్ బెడ్‌రూమ్ పథకం, 5) రైతుబంధు, 6) ధరణి, 7) మిషన్ భగీరథ, 8) మిషన్ కాకతీయ, 9) ఆరోగ్యశ్రీ, 10) హరితహారం, 11) రీజనల్ రింగ్‌రోడ్, 12) రియల్ ఎస్టేట్ అనుమతులు, 13) పారిశ్రామిక అనుమతులు, 14) ధాన్య సేకరణ, 15) పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలు, 16) పోలీసు నియామకాలు, 17) షీ టీమ్స్, 18) సీసీ కెమేరాల ఏర్పాటు, 19) ఫ్లై ఓవర్లు, 20) పార్కుల ఏర్పాటు, 21) రోడ్ల వెడల్పు కార్యక్రమాలు, 22) ప్రగతి భవన్, సెక్రటేరియేట్, జిల్లా కలెక్టరేట్ల కార్యాలయాల నూతన భవన నిర్మాణాలు. 23) ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నిర్మాణాలు, 24) కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 25) బతుకమ్మ చీరలు, 26) రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, 27) తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుల నియామకాలు, 28) బీడీ కార్మికులకు చేయూత, 29) కులాలవారీగా కులవృత్తుల అభివృద్ధి, 30) దళితబంధు, మొదల్కెనవి.



### బీఆర్ఎస్ హామీ ఇచ్చి వదిలేసినవి..

1) గల్ఫ్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి 2) బీసీల అభివృద్ధి, 3) ఎస్సీల అభివృద్ధి, 4) ఎస్టీల అభివృద్ధి, 5) మైనారిటీల అభివృద్ధి, 6) కులాల వారీగా అభివృద్ధి, 7) నిరుద్యోగులకు ఉపాధి కల్పన, 8) ఉన్నత విద్య అభివృద్ధి, 9) విద్యావంతులకు స్వయం ఉపాధి కల్పన, 10) బీదవారికి మూడు ఎకరాల భూమి 11) సబ్బండ వర్గాల అభివృద్ధి, 12) జిల్లా స్థాయిలో సాఫ్ట్‌వేర్ రంగం వికేంద్రీకరణ, 13) అభివృద్ధి వికేంద్రీకరణ, 14) నూతన పరిశ్రమల, సంస్థల పునరుద్ధరణ 15) అవినీతి నిర్మూలన, 16) గ్రంథాలయాల అభివృద్ధి, 17) తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు అభివృద్ధి, 18) మహిళల అభివృద్ధి, 19) చేనేత, పవర్‌లూమ్ అభివృద్ధి మొదల్కెనవి. వీటిలో కొన్ని అసలే చేయనివి. కొన్ని ప్రారంభించి వదిలేసినవి ఉన్నాయి.

### నిరుద్యోగుల పెళ్లిలు వాయిదా

సామాజిక వర్గాల వారీగా చూసినప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన బడ్జెట్ తక్కువ. కేటాయించిన మేరకు ఖర్చు కూడా చేయలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా తొలిదశలో స్వయం ఉపాధికి కొంత కృషి చేయడం జరిగింది. ఆ తర్వాత ఎనిమిదేళ్ళు మొండిచెయ్యి చూపడం జరిగింది. చేపల పెంపకం, గొర్రెల పెంపకం వంటి పథకాలతో కులాలవారీగా కులవృత్తుల అభివృద్ధికి చేసిన కృషి సక్రమంగా సాగలేదు. విద్యావంతులకు ఉపాధి కల్పించలేదని విమర్శలు పెరిగాయి. పదేళ్లలో విద్యావంతులు, నిరుద్యోగులు ముప్పై లక్షలకు పెరిగారు. నూతన ఉద్యోగాల కల్పనతో కనీసం 5 లక్షల మంది విద్యావంతులకు ఉపాధి కల్పించడం సాధ్యమే. ఆ పని చేయలేకపోయారు. ఈ కొత్త ప్రభుత్వం ఈ పని చేస్తే విద్యావంతులు చాలా సంతోషిస్తారు. ఉద్యోగం దొరికితే పెళ్లి చేసుకుంటామని లక్షలాది మంది పెళ్లిళ్లు వాయిదాలు వేసుకున్నారు. పైగా నిరుద్యోగులకు పిల్లను ఎవరు ఇస్తారు?

### కార్పొరేషన్లను నియమిస్తే సరిపోతుందా..?

50కి పైగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించి పలువురికి స్థానం కల్పించారు. తెలంగాణ ఉద్యమకారులలో కొంతమందిని రాజకీయాల్లో, నామినేటెడ్ పదవుల్లో తీసుకొని సముచిత స్థానం ఇచ్చారు. అందులో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్‌గా నాకు బాధ్యతలు అప్పగించారు. దానికి సంబంధించిన పనులు అప్పగించారు. కుల గణన కోసం జీవో ఇచ్చి బడ్జెట్ ఇవ్వడం మరిచారు. అన్ని కార్పొరేషన్లది ఇదే దుస్థితి. పేరుకి కార్పొరేషన్లు. ఇక నుండి వీటికి బడ్జెట్‌లు కేటాయించి చక్కగా ప్రజలకు సేవ చేసేట్టు చూడడం అవసరం.

### సొంతింటి కల నెరవేరిందా...

పేదల స్వంత ఇంటి కల సాకారం చేసే డబుల్ బెడ్ రూమ్ పథకం గ్రామంలో ఎన్నో ఆశలు కల్పించింది. డబుల్ బెడ్‌రూమ్ కట్టడానికి ఆరు నెల్లు చాలు. అలా యేడాదిలోపే టెండర్లు పూర్తి చేసి కలెక్టర్ ద్వారా ప్రతి సంవత్సరం పంపిణీ చేయడం సాధ్యమే. ఆ పని చేయకుండా పదేళ్లుగా కట్టినవాటిని కూడా ప్రజలకు వెంటనే అందించలేదు. వీటిని ఇప్పుడు మరమ్మతులు చేసి వెంటనే నూతన ప్రభుత్వం ప్రజలకు కేటాయించి ప్రశంసలు పొందవచ్చు. మిషనన భగీరథ పేరిట చాలాచోట్ల పైపులు వేశారు. రక్షిత నీరు ఇవ్వడం మరిచారు. వీటిని వెంటనే వినియోగంలోకి తెచ్చి నూతన ప్రభుత్వం ప్రజల మన్నన పొందవచ్చు.

### కుటుంబానికి ఆరు లక్షల అప్పు


తెలంగాణాలోని కోటి కుటుంబాలపై పదేళ్ళలో గత ప్రభుత్వం ఆరు లక్షల చొప్పున అప్పు మీద వేసింది. దీనికి కట్టే కిస్తులు, వడ్డీ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన బడ్జెట్‌కన్నా ఎక్కువైపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంలోకి రాకుండానే అసలు, వడ్డీలు కట్టవలసి వస్తున్నది. ఈ అప్పులన్నింటిని 9 శాతం వడ్డీ నుంచి 2 శాతం వడ్డీకి వచ్చేవిధంగా రీఆర్గనైజ్ చేసుకోవాలని నూతన ప్రభుత్వం ఆలోచించడం సంతోషకరమైన విషయం.

### అది చీకటి అధ్యాయమే..

కూరగాయల చిన్న వ్యాపారులు బండి వ్యాపారులకు చేయూతనిచ్చి అసంఘటిత కార్మికులకు, కూలీలకు ఒక కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చి పీఎఫ్ ఖాతా ఏర్పాటు చేయడం అవసరం. కులగణన వెంటనే చేపట్టి హైకోర్టు అడిగిన వివరాలు సమర్పిస్తే ఆ రిజర్వేషన్లు పెరిగి ఉండేవి. అలా చేయలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కుల గణన చేపట్టి జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచి ఎన్నికలు నిర్వహించడం అవసరం.

గత ప్రభుత్వంలో సీఎం సెక్రటేరియేట్‌కి రాకపోవటం, ప్రజలకు అందుబాటులోకి లేకపోవడం అనేవి ప్రజలను అసంతృప్తికి గురి చేశాయి. కనీసం ఎమ్మెల్యేలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్ దొరికేదే కాదు. దీంతో పరిపాలన కుంటుపడిరది. ఒక మొత్తంగా చూసినప్పుడు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేకపోవడమే చీకటి అధ్యాయం. ఈ విషయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ అధికార పరిధులతో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం అందుబాటులో ఉండడం అవసరం.

## ఔట్సోర్సింగ్ విధానంలో ప్రక్షాళన చేయాలి



ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో పనులు చేయడానికి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రస్తుతం ఉద్యోగాల భర్తీ జరుగుతుంది. ఎన్నికల్లో నాయకులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీలు ఇవ్వడంతో అవుట్సోర్సింగ్ పద్ధతిలో నియామకాల కోసం నిరుద్యోగులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు నిరుద్యోగుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనివల్ల మెరిట్ ఉండి, రిజర్వేషన్లు, అనుభవం ఉన్నవారు చాలా నష్టపోతున్నారు.

ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయు నియామకాలను సైతం మెరిట్, సీనియార్టీ, అనుభవం రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకొని బహిరంగ నోటీసు, నోటిఫికేషన్లను విడుదల చేసి నియామకాలు చేయాలి. అర్హులైన వారి నియామకాల వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయి.

గతంలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ సమయంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయాల లెటర్ ద్వారా సిఫార్సులు, అభ్యర్థులకు సమాచారం అర్హతలు గల అభ్యర్థులకు అందేది. కానీ ఎంప్లాయ్మెంట్ కార్యాలయాల్లో ఎటువంటి సమాచారం అందడం లేదు. దీంతో ఎంప్లాయిమెంట్ కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు బూడిదలో పోసిన పన్నీరుగా.. మారిపోతున్నాయి. దీనిని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శాఖను లేదా ఎంప్లాయిమెంట్ శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లో ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీ చేయాలని సమాచార హక్కు వికాస సమితి ప్రభుత్వాన్ని కోరుతుంది.



– డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు 99496 49766

# దేశ ప్రగతిలో ఎవరి పాత్ర ఎంత?

## 70 ఏండ్ల దేశ ప్రగతిపై సింహావలోకనం

**ఈ మధ్య కాలంలో అన్ని పార్టీలు "ఆత్మ స్తుతి - పరనింద"ను నమ్ముకున్నున్నాయి. నిజాన్ని నిర్భయంగా ఒప్పుకునే ధైర్యం ఎవరికీ లేదు. ఎవరు ఒప్పుకున్నా.. లేకున్నా మేధావులు, పరిశీలకులు, యథార్థవాదులు, గమనిస్తూనే ఉంటారు. ఏ పార్టీ అధికారంలో ఉండగా భవిష్యత్తుకు బాటలు వేస్తూ దీర్ఘకాలపు ప్రయోజనాలకై పాటు పడ్డారో ఆ ప్రాజెక్టులు, పరిశ్రమలు మనకు సాక్ష్యం చెబుతాయి. అభివృద్ధి ఫలాలను భారత ప్రజలు అనుభవిస్తున్నదే నిజం.**

"మాటలతో కాదు, చేతలలో చూపాలి" అంటారొక కవి. మనది వ్యవసాయ ఆధారిత దేశం. ఇక మన యువతకు ఉపాధి, అవకాశాలు కావాలి. ఈ ప్రాధాన్యతను పక్కన పెట్టి ఏవేవో గాలి కబుర్లు, మాటల గారడీల తోకాలం గడపడం మన అభివృద్ధి చెందుతున్న దేశానికి క్షేమం కాదు. భవిష్యత్తు తరాలు క్షమించవు.

### 70 సంవత్సరాల్లో ఆయా ప్రభుత్వాల పరిపాలన

1) భరత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది 1947 ఆగష్టు 15 అని అందరికీ తెలిసిందే. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం కొలువుతీరింది 1952లో. మొదటి ప్రధాని శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ. ఆయన 16 ఏండ్ల 9 నెలల 14 రోజులు ప్రధాన మంత్రిగా ఉన్నారు. దేశంలో ఆనాడు ఆహార ధాన్యాలకు చాలా కొరత ఉండేది. ఎటు చూసినా కరువు కాటకాలు. జనాభాలో 85% గ్రామీణులు వ్యవసాయంపై ఆధారాపడే వారు. వానలు సకాలంలో కురవక, ప్రకృతి సహకరించక పంటలు అంతంత మాత్రంగానే చేతికి వచ్చేవి. ఈ పరిస్థితుల్లో బెంగాల్, బీహార్ లో కరువుతో తిండి లేక ఎంతో మంది మరణించారు. ఇక మిగతా ప్రాంతాల్లో కూడా ఆహారానికి అలమటించేవారు. మన దేశంలో జీవ నదులు ఎన్ని ఉన్నా నీరు సముద్రం పలయ్యేది. నెహ్రూ వివిధ రంగాలకు చెందినా మేధావులను చర్చించి తమ ప్రభుత్వం ముందున్న సవాల్లను ఎదుర్కోవడానికి ప్రాధమ్యాలను నిర్ణయించుకున్నారు.

తమ మొదటి ప్రాధాన్యంగా వ్యవసాయ రంగాన్ని ఎన్నుకున్నారు. దాని కొరకు మనకున్న నదులపై "బహులార్థక సాధక ప్రాజెక్టులే శరణ్యం" అని నిర్ధారించుకున్నారు. ప్రముఖ ఇంజనీర్ల సలహాలతో 1) భాక్రానంగల్ 2) హీరాకుడ్ 3) దామోదర్ వ్యాలీ 4) నాగార్జున సాగర్ లాంటి భారీ ప్రాజెక్టుల యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. ప్రాజెక్టుల వల్ల తాగు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కూడా నెలకొల్పడం జరిగింది.

రెండవ ప్రాధాన్యంలో భారీ పరిశ్రమలు చేపట్టారు. భిలాయ్, భోకారో ఉక్కు కర్మాగారాల నిర్మాణాలు చేపట్లానారు. ఈ పరిశ్రమల వల్ల మనకు కావలసిన ఉక్కు స్వయం సమృద్ధికి బాటలు వేశారు. ఇవి కాక ఔషధ పరిశ్రమలు కూడా నిర్మించారు. భారీ పరిశ్రమల రంగానికి వస్తే బీహెచ్ఈఎల్, బీడీఎల్, హెచ్ఎంటీ, హెచ్ఏఎల్ లాంటివి నిర్మించి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించిచారు. ఆయన సేవలు అజరామరణం.

అనంతరం లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా స్వల్ప కాలమే ఉన్నా మంచి పేరు సంపాదించారు. "జై జవాన్ – జై కిసాన్" అనే నినాదంతో ప్రజలకు దేశభక్తిని పెంపొందించారు. అనంతరం ఇందిరా గాంధీ గారు ప్రధానిగా 1966 నుంచి 77 వరకు ఆ పిదప 1980 నుంచి 1984 చనిపోయే వరకు పరిపాలన బాధ్యతలు నిర్వహించారు. ఇందిరా గాంధీ సాహసోపేత నిర్ణయాలు భారత జాతి మరచిపోలేదు. 1) రాజ భరణాల రద్దు 2) బ్యాంకుల జాతీయకరణ 3) 20 సూత్రాల పథకం మన దేశ దారిద్ర్య నిర్మూలనకు బాటలు వేసింది. ఈ పథకాలు ప్రపంచ రాజనీతి శాస్త్రంలో, పాఠ్య ప్రణాళికలో చేర్చబడ్డాయి. 1975 ఎమర్జెన్సీ విధించడం వల్ల ఆమెకు తీరని మచ్చ తెచ్చింది. దీంతో 1977లో ఎన్నికలలో ఓటమి పాలయ్యారు.

కీ.శే. జయప్రకాశ్ నారాయణ సారథ్యంలో జలతా పార్టీ మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అందరూ మేధావులే సయోధ్య లేక మొరార్జీ దేశాయ్, విశ్వనాథ ప్రతాప్ సింగ్, చరణ్ సింగ్ వంటి వారు ప్రభుత్వాన్ని నడపలేక పోయారు. ఇందిరా గాంధీ 1980లో తిరిగి అఖండ మెజార్టీతో ప్రధాని అయ్యారు. ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. రాజీవ్ గాంధీ కాలంలోనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని మన దేశంలో ప్రవేశపెట్టారు. ప్రపంచ దేశాలకు ధీటుగా మన యువత సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అగ్ర రాజ్యాల్లోని ప్రముఖ కంపెనీలకు మన వారే కీలక పదవులను నిర్వహిస్తున్నారు.



అనంతరం నరసింహారావు ప్రధానిగా పాలనను కూడా జాతి మరువలేదు. కుదువ బంగారాన్ని మన దేశానికి రప్పించడం, ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం వల్ల పరిశ్రమలు విస్తరించి ఎంతో మంది యువతకు ఉపాధి ఉద్యోగాలు లభించాయి. ప్రముఖ ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ ప్రధానిగా పాలించిన రోజుల్లో మన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ప్రపంచ ప్రఖ్యాతి తెచ్చినారు. మన్మోహన్ సింగ్ 2004 నుండి 2014 వరకు ప్రధానిగా ఉన్నారు.

కాంగ్రెసేతర ప్రధానిగా అటల్ బిహారీ వాజ్ పేయి ప్రధానిగా 1996 లో 14 రోజులు, 1998 లో కొంతకాలం, 1999 నుంచి 2004 వరకు ప్రధానిగా పరిపాలన చేశారు. వాజ్ పేయి వివాస్పధుడు కాకుండా అందరి మన్ననలనందుకొన్నారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు కాపాడాడు. "ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన" అనే రోడ్డు నిర్మాణ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేశారు.

నేటి మన భారత ప్రధాని నరేంద్ర మోదీ 2014 నుంచి పాలన కొనసాగిస్తున్నారు. గతంలో ఏ ప్రధాని పైన లేనన్ని విమర్శలు ప్రతిపక్షాలతోనే కాకుండా మేధావి వర్గం నుంచి కూడా ఎదుర్కొంటున్నారు. తాను చేసిన వాగ్దానాలను ఏవీ నిలబెట్టలేదనే విమర్శలు ఎదుర్కుం టున్నారు.

"విమర్శించడం, విభేదించడం ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక లక్షణాలు రాజ్యాంగ బద్ధమైన భావ ప్రకటనకు నిలువెత్తు సాక్ష్యాలు.

జై హింద్

– జిన్నం అంజయ్య
కవి, రచయిత, సీనియర్ రాజకీయ నాయకుడు
ఫోన్ : 9849310392

## అబ్కీ బార్ చార్ సౌ పార్
# అనేది పూర్తిగా ఒక కళ

**ఎంపీ శశిథరూర్**



**విశ్వంభర, ఢిల్లీ :** బీజేపీ అబ్కీ బార్ 400 పార్ అనేది ఒక కళ అని, ఈ సారి ఓటింగ్ మంచి సంఖ్యలో జరగడంతో తమ విశ్వాసం మరింత పెరిగిందని కాంగ్రెస్ నేత, ఎంపీ శశిథరూర్ అన్నారు. ఎన్నికల గురించి మీడియాతో మాట్లాడిన ఆయన ఫలితాలపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో తిరిగానని, బీజేపీ చెబుతున్న అబ్కీ బార్ చార్ సౌ పార్ అనేది పూర్తిగా ఒక కళ అని స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. గతంలో 2019 లో పుల్వామాలో జరిగిన విషాదానికి బాలాకోట్ లో జరిపిన ప్రతిస్పందనకు ధన్యవాదాలు చెబుతూ.. ఈ ఘటన మోడీ మొదటి టర్మ్ యొక్క ఆర్థిక వైఫల్యాలపై రెఫరెండంగా ఉండాల్సిన ఎన్నికలను జాతీయ భద్రతా ఎన్నికలుగా మార్చిందని అన్నారు. ఫలితంగా అనేక రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ఆ 11 రాష్ట్రాల్లో మళ్లీ ఆ తరహా ఫలితాలను పునరావృతం చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. బీజేపీ బలంగా ఉన్న స్థానాల్లో కనిష్ట ఓటింగ్ నమోదు అయ్యిందని, గత ఓటింగ్ గణాంకాలతో పోలిస్తే గణనీయంగా తగ్గింద ని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థులు బలంగా ఉన్న చోట ఓ టింగ్ ఉత్సాహాన్ని కనబర్చిందని, ఓటింగ్ మంచి సంఖ్యలో జరిగడంతో మా విశ్వాసం మరింత పెరిగిందని శశిథరూర్ వెల్లడించారు.




## అమెరికా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత విద్యార్థులు మృతి

**విశ్వంభర, హైదరాబాద్ :** అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మరణించగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా.. అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్వక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18 ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా, గత నెల అరిజోనాలోని లేక్ ప్లెసెంట్ సమీపంలో పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ఇద్దరు భారతీయ విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే.

## ఆప్ నా పైన కుట్రలు చేస్తోంది

**స్వాతి మాలీవాల్ సెన్సేషనల్ కామెంట్స్**



**విశ్వంభర, ఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ పై కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్ దాడి చేయగా.. ఈ అంశం తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే స్వాతి మలివాల్ సంచలన ఆరోపణలు చేశారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడాలని ఆప్ నేతలపై ఒత్తిడి చేస్తోందన్నారు. అంతేగాక తన వ్యక్తిగత ఫొటోలను లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఒక సీనియర్ నాయకుడి నుంచి నాకు ఫోన్ వచ్చింది. స్వాతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయాలని, తనపై హీనంగా మాట్లాడాలని ఒత్తిడి పెరుగుతున్నట్టు నాతో చెప్పారు. అంతేగాక నాకు మద్దతుగా మాట్లాడిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు' అని పేర్కొన్నారు. ఒకరికి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించే బాధ్యతను, మరొకరికి ట్వీట్ చేసే బాధ్యతను అప్పగించారన్నారు. నిందితులకు సన్నిహితంగా ఉన్న కొందరు రిపోర్టర్లు నకిలీ స్టింగ్ ఆపరేషన్లు కూడా చేస్తున్నారని తెలిపారు. కానీ ఎందరు వచ్చినా ఒంటరిగా పోరాడేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. 'నా ఆత్మగౌరవం కోసం పోరాటం ప్రారంభించాను. పోరాడుతూనే ఉంటాను. న్యాయం జరిగే వరకు కొట్లాడుతాను' అని పేర్కొన్నారు. మరోవైపు స్వాతి మలివాల్ దాడి కేసులో నిందితుడైన బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు బుధవారం ముంబై నుంచి తీసుకొచ్చారు.

## హోం మంత్రిత్వ శాఖను
# పేల్చేస్తామని బెదిరింపు మెయిల్




**విశ్వంభర, ఢిల్లీ :** ఇటీవల వరసగా దేశంలోని పలు నగరాలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో ఢిల్లీలోని దాదాపు 150 స్కూళ్లకు బూటకపు బాంబు బెదిరింపులు వచ్చాయి. తాజాగా బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించి, ఏం లేదని తేల్చారు. న్యూఢిల్లీ ఏరియాలోని నార్త్ బ్లాక్ పోలీస్ కంట్రోల్ రూంకు బెదిరింపు మెయిల్ వచ్చింది. హోంశాఖ భవనం వద్దకు రెండు ఫైర్ ఇంజన్లను పంపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నియంత్రణలో ఉన్న హోం మంత్రిత్వ శాఖను పేల్చేస్తామని బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో హోం శాఖ కొలువుదీరిన నార్త్ బ్లాక్‌లో పోలీసులు సోదాలు నిర్వహించారు. అయితే అనుమానాస్పదమైంది ఏదీ కనిపించలేదని తెలుస్తోంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బెదిరింపు మెయిల్ గురించి పోలీసులకు సమాచారం అందింది.

# ఫొటోలో బాగుంటే కాపురం బాగున్నట్లు కాదు

- వివాహేతర సంబంధం ఆరోపణలు క్రూరత్వంతో సమానం
- విశ్వాసం, ప్రేమ, గౌరవం ఆధారంగా వివాహ వ్యవస్థ కొనసాగుతుంది
- అందుకే విడాకులు మంజూరు చేస్తున్నాం.. కర్ణాటక హైకోర్టు తీర్పు




**విశ్వంభర, బెంగళూరు :** దంపతుల మధ్య సాన్నిహిత్యాన్ని ఒక ఫొటో ఆధారంగా నిర్ధరించలేమని కర్ణాటక హైకోర్టు అభిప్రాయపడింది. తమకూరుకు చెందిన మహిళ విడాకుల పిటిషన్‌పై దర్యాప్తు జరిపిన జస్టిస్ శివరామన్, జస్టిస్ అనంత రామనాథ హెగ్డేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి వేడుకలో పాల్గొన్న దంపతులు ఫొటో దిగినంత మాత్రాన వారి మధ్య బంధం బాగానే ఉందని అర్థం కాదని ధర్మాసనం పేర్కొంది. ఫొటోను బట్టి దంపతుల మధ్య ఉన్న సంబంధాలపై స్పష్టతకు రావడం కుదరదని స్పష్టం చేసింది. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ మహిళకు తన భర్తతో విడాకులు మంజూరు చేసింది హైకోర్టు.

### అసలేంటీ కేసు?

బాధిత మహిళకు 2008 నుంచి ఓ వ్యక్తితో పరిచయం ఉంది. ఆ తర్వాత వీరిద్దరూ 2013లో వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత సదరు మహిళ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసింది. రెండేళ్లపాటు సాఫీగా సాగిన వీరి కాపురంలో అకస్మాత్తుగా విభేదాలు మొదలయ్యాయి. తన భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త ఆరోపించాడు. ఆమె ఫోన్ కాల్స్ చెక్ చేసేవాడు. మహిళపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో 2017లో మహిళ భర్తను వదిలిపెట్టి బెంగళూరులోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఫ్యామిలీ కోర్టులో విడాకులు కోసం దరఖాస్తు చేసుకుంది. తనను భర్త చిత్రహింసలకు గురిచేస్తున్నాడని, అలాగే హత్య చేసేందుకు యత్నించాడని మహిళ విడాకుల పిటిషన్‌లో పేర్కొంది.

### ద్విసభ్య ధర్మాసనం ఏం చెప్పింది..?

"తన భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త ఆరోపించాడు. దీనికి సంబంధించిన ఆధారాలు అతడు సమర్పించలేదు. ఇలాంటి ఆరోపణ చేయడం క్రూరత్వంతో సమానం. దంపతుల మధ్య పరస్పర విశ్వాసం, ప్రేమ, గౌరవం ఆధారంగా వివాహ వ్యవస్థ కొనసాగుతుంది. దంపతుల్లో ఒకరు ఇంకొకరి ప్రవర్తనను అనుమానించి, దానిని నిరూపించకపోతే అలాంటి ఆరోపణ నిరాధార మైనది. ఈ ఆరోపణలు వైవాహిక బంధాన్ని విచ్ఛిన్నం చేస్తా యి. అలాంటప్పుడు భార్య తన వైవాహిక జీవితాన్ని ప్రశాం తంగా కొనసాగించలేదు. అందుకే భర్త నుంచి మహిళకు విడాకులు మంజూరు చేస్తున్నాం." అని కర్ణాటక హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### భర్త వాదన ఇది..

మాస్టర్స్ డిగ్రీ పొందిన తర్వాత మహిళ అహంకారంతో వ్యవహరిస్తోందని భర్త తరఫు న్యాయవాది ఫ్యామిలీ కోర్టులో వాదించారు. భర్తను ఆమె తల్లిదండ్రుల వద్దే నివసించాలని బలవంతం చేస్తోందని అన్నారు. భార్యకు విడాకులు ఇవ్వడం భర్తకు ఇష్టం లేదని న్యాయస్థానానికి తెలిపారు. 2018 లో దంపలిద్దరూ ఒక వివాహానికి హాజరై కలిసి ఫొటో దిగారని, వారిద్దరూ సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. దంపతులకు విడాకులు ఇవ్వాల్సిన అవసరం లేదని, విడాకులపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ నేపథ్యంలో వాదనలు విన్న ఫ్యామిలీ కోర్టు మహిళ విడాకుల పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ క్రమంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది మహిళ. వాదనలు విన్నద్విసభ్య ధర్మాసనం దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది.



## వికలాంగ పట్టభద్రుల ఓట్లు తీన్మార్ మల్లన్నకే

- బీఆర్ఎస్, బీజేపోళ్లకు అడిగే హక్కు లేదు
- వికలాంగుల సంక్షేమ శాఖ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య


**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 వేల వికలాంగ పట్టభద్రుల ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకేనని వికలాంగుల సంక్షేమ శాఖ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా వికలాంగ పట్టభద్రుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.వికలాంగ పట్టభద్రులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వికలాంగ సంఘాల సంపూర్ణ మద్దతు మల్లన్నకేనని ప్రకటించారు. వికలాంగుల సంక్షేమ శాఖని, కార్పొరేషన్‌ని ఏర్పాటు చేయడమే కాకుండా విద్యలో, ఉద్యోగంలో రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేని స్పష్టం చేశారు. వికలాంగులకు ఆర్థిక సహకారం, హక్కులు, సంరక్షణ, జీవన భద్రత, మెరుగైన విద్య,వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగాలు పొందేలా.. ఇలా ఎన్నో చట్టాలను కాంగ్రెస్ పార్టీ చేసిందని అన్నారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ పాలనలో వికలాంగుల ఉద్యోగాలతో పాటు ఎలాంటి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. 9 వికలాంగుల జాతీయ సంస్థల్లో ఒక్క ఉద్యోగం కూడా గడిచిన 10 ఏళ్లలో భర్తీ చేయలేదని ఆరోపించారు. వికలాంగ బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో సాగర్ రింగ్ రోడ్డు హోమ్ హాస్టల్లో ఉంటున్న నల్లగొండ జిల్లా నిరుద్యోగ వికలాంగుడు బొమ్మకంటి మహేందర్, హనుమకొండ హోమ్ హాస్టల్లో ఉంటున్న ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ వికలాంగుడు రాగుల రామ్మోహన్ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం,రూ.10 లక్షల పరిహారం ఇస్తామని గత బిఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని ధ్వజమెత్తారు. వికలాంగులను అన్ని విధాలుగా మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నల్గొండ మార్కెట్ కమిటీ జూకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్సా రవి, వీహెచ్‌పిఎస్ అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్, సిహెచ్ మత్స్యగిరి, వి.ముత్తయ్య, డి. శంకర్, ఎం.నాగరాజు, మాధవరెడ్డి,మధు, డి. సైదులు, సైదిరెడ్డి, బుచ్చి రాములు, ఎం. నగేష్ పాల్గొన్నారు.

## ఆర్కపల్లి యువత కల సహకారం అయ్యేనా..?



**విశ్వంభర, మాడ్గుల మే 22 :** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామపంచాయతీలో చెరువు కబ్జాకు గు రి అయ్యిందని 42 ఎకరాలు ఉండాల్సింది చెరువు శిఖం భూమి పది ఎకరాలకు కుదిరించబడిందని అర్కపల్లి గ్రామ యువత ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కబ్జాకోర్ల నుంచి కాపాడిన ఆంజనేయ స్వామి దేవస్థానం భూమికి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా బడికి సంబంధించిన భూమి కూడా కబ్జాకోరుల చేతుల్లోకి పోతుందని ఇట్టి భూములకు హద్దు రాళ్లు ఏర్పటుచేసి ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామ యువత స్థానిక మాడ్గుల మండలం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ సెక్రటరీ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్తో మాట్లాడి పదిహేను రోజుల్లో ఇట్టి సమస్యను పరిష్కరించి హద్దులు నిర్ణయిస్తానని ఎమ్మార్వో యువతకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ హామీతో ఆర్కపల్లి భవిష్యత్తు భావితరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని గ్రామ యువత కోరుకోవడం జరిగింది.

## చంచల్ గూడ జైలుకు హైదరాబాద్ సీసీఎస్
# ఏసీపీ ఉమామహేశ్వర రావు




**విశ్వంభర, హైదరాబాద్ :** ఏసీబీ అధికారులకు చిక్కిన ఉమామహేశ్వరరావు పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఉమామహేశ్వరరావును చంచల్ గూడ జైలుకు తరలించారు. కాగా ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నయనే ఆరోపణలతో ఏసీబీ రైడ్ చేసి మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ అశోక్ నగర్ లోని ఏసీపీ ఇంటికి చేరుకున్న ఏసీబీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 14 చోట్ల ఏకకాలంలో మరిన్ని బృందాలు సోదాలు జరిపాయి. ఉమామహేశ్వరరావు సోదరుడితో పాటు బంధువులు, సన్నిహితులు ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. సోదాల్లో భారీగా రూ. 500 నోట్ల కట్టలను, ఆభరణాలను, 17 ప్రాంతాల్లో ఉన్న స్థిరాస్తుల పత్రాలను గుర్తించారు.



## హైదరాబాద్‌లో దర్శనమిస్తున్న జలకన్యలు

**విశ్వంభర, కూకట్‌పల్లి:** జలకన్య అనగానే సగం మనిషి శరీరం, సగం చేప ఆకారం ఉంటుందని సాధారణంగా కథలలో వింటూనే ఉంటాం. అయితే అప్పుడప్పుడు సముద్ర తీరానికి జల కన్య వచ్చింది అంటూ కొన్ని రూమర్స్ కూడా చక్కర్లు కొడుతుంటాయి. జల కన్యలను కొన్ని గ్రాపిక్స్ సినిమాల్లో తప్ప ఎవరూ నేరుగా చూసింది లేదు. అయితే విదేశాల్లో ముఖ్యంగా సముద్ర ప్రాంతాలను కలిగి ఉన్న దేశాలు ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఈ జలకన్యలతో ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ మహానగరంలో కూకట్‌పల్లిలో జల కన్యలు దర్శనమిచ్చారు. మెరైన్ పార్క్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో జల కన్యలతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మొట్ట మొదటిసారి హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. దీంతో జలకన్య రూపంలో ఉన్న వారిని చూసేందుకు ప్రజలు బారులు తీరుతున్నట్లు తెలుస్తుంది. నిజమైన జల కన్యలు ఎలా ఉంటారో తెలియని వారు ప్రదర్శనలో జలకన్యల రూపంలో ఉన్న మహిళలనే నిజమైన జలకన్యలుగా భావించి సెల్ఫీలు తీసుకుంటున్నారు.



## ట్రంప్ బయోపిక్‌లో విస్తుపోయే విశేషాలు

**విశ్వంభర, వాషింగ్టన్ :** శృంగార తారకు అక్రమ నిధుల బదిలీ కేసులో ట్రంప్ ప్రస్తుతం కోర్టు విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఇటీవల ట్రంప్ బయోపిక్ ప్రీమియర్ షో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శించారు. " ది అప్రెంటిస్ ' పేరిట వచ్చిన ఈ చిత్రం పై ట్రంప్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీన్ని కోర్టులో సవాల్ చేస్తామని వెల్లడించాయి. చాలా సన్నివేశాలు కల్పితాలు అనే డిస్ క్లెయిమర్ తోనే ఈ చిత్రం ప్రారంభమవుతుందని సమీక్షకులు పేర్కొన్నారు. 1970 ,1980లలో ట్రంప్ అమెరికా స్థిరాస్తి వ్యాపారంలో ఎలా ఎదిగారో ఈ సినిమాలో చూపించారు. ఇందులో కొన్ని సన్నివేశాలు కల్పితమని... మాజీ అధ్యక్షుడు ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఆయన ప్రచార బృందం ఆరోపించింది. దీన్ని ఒక చెత్త చిత్రంగా కొట్టిపారేసింది. హాలీవుడ్ లోని ప్రముఖులు పన్నిన కుట్రగా అభివర్ణించింది. మారో వైపు నవంబర్ లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో ఉన్నారు. అలాంటి సమయంలో ఈ చిత్రం తెరపైకి రావడం గమనార్హం.




# పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

**• రాష్ట్ర సర్పంచుల సంఘం డిమాండ్ • రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ కి వినతి పత్రం**

**విశ్వంభర, కార్వాన్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సర్పంచుల సంఘం బుధవారం డిమాండ్ చేసింది. గ్రామాల్లో అభివృద్ధి అనే ఆ కాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి, జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పదంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపులలో గత, తాజా ప్రభుత్వాలు జాప్యం వహించి సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించిన కాగితానికే పరిమితమయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేష్, కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సైలెన్సర్లు మార్చితే కఠిన చర్యలు

**ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ**

**విశ్వంభర, వరంగల్ మే 22 :** ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మార్పు చేస్తే వాహనదారుడితో పాటు మెకానిక్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం సీపీఓ జంక్షన్ వద్ద అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ తో ధ్వంసం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు గుర్తించి వాటిని తొలగించారు. ఆ సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ తో ధ్వంసం చేశారు. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్ మార్పు చేస్తే వాహనదారుడి లైసెన్సును 3 నెలలు రద్దు చేయడం తోపాటు వాహనాన్ని సీజ్ చేయడం తోపాటు మెకానిక్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐలు శ్రీధర్, షుకూర్, నాగబాబు, పూర్ణ చంద్ర రెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి

**ప్రధానోపాధ్యాయుడు దశరథ్**

**విశ్వంభర, పరిగి మే 22 :** విద్యార్థులు ఉచిత సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు దశరథ్ కోరారు. మండల పరిధిలోని చిట్యాల్ కాంప్లెక్స్ లోని యబాజిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా బోధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దశరథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి బోధనతో పాటు ఆట, పాటలతో కూడిన సమ్మర్ క్యాంపును శిక్షణ ఫౌండేషన్ వారు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు ఆంగ్ల విద్యపై నైపుణ్యం, సృజనాత్మకతను పెంపొందించే విధంగా బోధన కొనసాగుతుందన్నారు. దీనిని గ్రామంలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యబాజిగూడ పాఠశాల ఉపాధ్యాయుడు రాజు, శిక్షణ ఫౌండేషన్ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.




# తీన్మార్ మల్లన్న ఒక చోటా నయూం

**బీజేపీ రాష్ట్ర నాయకులు కొప్పు భాష**

**విశ్వంభర, చింతపల్లి మే 22 :** కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఒక చోటా నయూం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, దేవరకొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ కొప్పు భాష అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు శివర్ల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మండల ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కొప్పు భాష హాజరయ్యారు. అనంతరం చింతపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని పట్టభద్రులని కలిసి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొప్పు భాష మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అధికార పార్టీ పక్షాన పోటీ చేస్తూ ప్రశ్నించే గొంతుకను అని చెప్పుకోవడం సిగ్గుచేటని, తీన్మార్ మల్లన్న ఒక చీటర్ ఒక బ్లాక్మెయిలర్, ఒక చోటా నయూం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల కోఆర్డినేటర్లు చేనమోని రాములు, గోపిడి అనిల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎగిరి శెట్టి అనిత, మండల ప్రధాన కార్యదర్శి, మండల కోఆర్డినేటర్లు బొడ్డు మహేష్ గౌడ్, కుకుడపు రామకృష్ణ, ధరణీపతి రమణారావు, గుర్రం వెంకటరమణ, గొడుగు శ్రీనివాస్, ఏర్పుల యాదగిరి, సముద్రాల నగేష్, సీనియర్ నాయకులు కనిగిరి గోవర్ధన్, వెన్నమ్ శేఖర్, సందుపట్ల రాజేశ్ సాగర్, గజ్జె అభినవ్, చెన్నయ్య, మహేందర్ పాల్గొన్నారు.

# బాక్సర్ నిఖత్ జరీన్‌ను సన్మానించిన కమిషనర్ రోనాల్డ్ రోస్

**విశ్వంభర, హైదరాబాద్, మే 22 :** ఎలోర్డా కప్‌పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నిఖత్ జరీన్ ను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్ సన్మానించారు. ఇటీవల కజకిస్తాన్ లో జరిగిన ఎలోర్డా కప్‌పోటీల్లో బాక్సర్ నిఖత్ జరీన్ 52 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. బాక్సర్ నిఖత్ జరీన్ ను బుధవారం తన ఛాంబర్‌లో కమిషనర్ రోనాల్డ్ రోజ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించినందుకు అభినందించారు. మున్ముందు హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దశ, దిశలా వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా బాక్సింగ్ క్రీడలో మరింత రాణించాలని కమిషనర్ అభిలాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, క్రీడారంగ అభివృద్ధికి జీహెచ్ఎంసీ కూడా కృషి చేస్తున్నదని తెలిపారు. బాలబాలికల క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక సమ్మర్ కోచింగ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, మాజీ ట్రెజరర్ కె.మహేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబురావు సాగర్, పాల్గొన్నారు.





# కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

**విశ్వంభర,హైదరాబాద్ :** వచ్చే నెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ ఆబిడ్స్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏంకోర్ డాటా ఎంట్రీ(డమ్మీ) రిహార్సల్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరుగు ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసి ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పగడ్బందీగా జరగాలని , ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు.

గుర్తింపు కార్డు ఉన్నవారికి మాత్రమే లోపలికి అనుమతించాలని అధికారులకు సూచించారు.

# కాంగ్రెస్ పార్టీకీ అమ్ముడు పోయిన బీజేపీ మండలాధ్యక్షుడిని తొలగించాలి

**• నారాయణపుర్ మండల బీజేపీని భ్రష్టు పట్టిస్తున్న దోనూరు వీరారెడ్డి...**

**• మాజీ ఎంపీటీసీ బీజేపీ సీనియర్ నాయకుడు ఆత్కూరి రాములు.**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్ మే 22 :** ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో నారాయణపుర్ బీజేపీ మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన సుర్వి రాజు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలకు మూడు రోజుల ముందు అమ్ముడుపోయాడని, అటువంటి వ్యక్తిని పార్టీలో ఎందుకు కొనసాగిస్తున్నారో కార్యకర్తలకు తెలియజేయాలని మాజీ ఎంపిటీసీ బీజేపీ సీనియర్ నాయకుడు ఆత్కూరి రాములు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయిన బీజేపీ మండల అధ్యక్షుడు పదవి నుండి తొలగించాలని. ఏమాత్రం అర్హత లేకపోయినా సుర్వి రాజుని మండల అధ్యక్షుడిగా చేసిన దోనూరు వీరారెడ్డి దీనికి పూర్తిగా బాధ్యత వహించాలి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పార్టీకి నష్టం జరగొద్దనే ఉద్దేశంతో ఆ రోజు ప్రెస్ మీట్ పెట్టించారని, నిజానికి మండల అధ్యక్షుడు అమ్ముడుపోయిండని అందరికీ తెలుసని ఎన్నికలు అయిపోయాక 16వ తేదీన చర్యలు తీసుకుంటామని కార్యకర్తలని మభ్యపెట్టి అమ్ముడుపోయిన వ్యక్తితో పార్టీని నడిపిస్తే పార్టీకి నష్టం జరుగుతుంది వెల్లడించారు. ఎన్నికలు రాగానే ఆధిపత్యం కోసం తమ చెప్పు చేతల్లో ఉండే వారిని అర్హత లేని వ్యక్తులకు పార్టీ బాధ్యతలు ఇస్తూ నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలని అణిచివేస్తూ అవమాన పరుస్తూ పార్టీ కార్యక్రమాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గుత్తాధిపత్యంతో అధికారం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధోరణి వెంటనే మానుకోవాలని మండల కమిటీ ని వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా, రాష్ట్ర పార్టీలో చర్యలు తీసుకోవాలని ఆత్కూరి రాములు కోరారు.

# వరి రైతులందరికీ రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే

**బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్**




**విశ్వంభర, నారాయణఖేడ్ మే 22:** కాంగ్రెస్ మేనిఫెస్టో పేర్కొన్న విధంగా ప్రభుత్వం వరి రైతులందరికీ క్వింటాలు కు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లించాల్సిందేనని బీజేపీ ప్రజాశంకంపేట మండలాధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు. బుధవారం పేటలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరికి 500 రూపాయలు బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని విస్మరించి మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సన్నవడ్లకు మాత్రమే రూ.500 ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. ఈ ప్రాంతంలో రైతులు 90% దొడ్డు బియ్యం ధాన్యాన్ని పండిస్తారని, రైతులు పండించిన వరికి ప్రభుత్వం వెంటనే రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, మాజీ సర్పంచ్ లు అశోక్, సుధాకర్, నాయకులు శ్రీశైలం, వెంకటయ్య, కురుమ దేవయ్య, మంగలి కృష్ణ, గుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కారులో ఊపిరాడక మూడేళ్ల చిన్నారి మృతి



**విశ్వంభర, మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. మణుగూరు మండలం సాంబాయిగూడెంలో కారులో ఊపిరాడక మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఆలస్యంగా బయటపడ్డ ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాంబాయిగూడెంలో సాయి కుమార్, లిఖిత దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కల్మిష అనే మూడేళ్ల పాప ఉంది. మంగళవారం సాయంత్రం కల్మిష ఆడుకుంటూ బయటకు వచ్చింది. ఆ సమయంలో లిఖిత నిద్రపోతుంది. కల్మిషతో పాటు చాలా మంది చిన్నారులు ఆడుకుంటున్నారు. అయితే.. కల్మిష ఆడుకుంటూ అక్కడే ఉన్న ఓ కారు ఎక్కింది. సడెన్‌గా కారు డోర్స్ అన్ని లాక్ అయిపోయాయి. కల్మిషతో ఆడుకుంటున్న పిల్లలు అంతా చిన్నారులే కావడంతో పెద్దగా పట్టించుకోలేదు. కల్మిష పిల్లలను చూస్తూ ఏడుస్తూనే ఉంది. కాసేపటికి కల్మిష స్పృహ తప్పి కారులోనే పడిపోయింది. సాయంత్రం సమయంలో గాలి దుమారం రావడంతో లిఖిత పాప కోసం బయటకు వచ్చింది. కానీ.. పాప మాత్రం కనిపించలేదు. గాలి రావడంతో అక్కడే ఆడుకున్న పిల్లలు కూడా ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు. లిఖిత పాప కోసం చుట్టుపక్కల వెతికింది. ఇంతలో కారులో స్పృహ తప్పిన కల్మిష కనబడింది. కారు లాక్ తీసిన లిఖత, సాయి కుమార్ పాపను ఆస్పత్రి తీసుకొని వెళ్లారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో స్థానికంగా విషాద ఛాయలు నెలకొన్నాయి.



# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

**జిల్లా ఎస్పీ చందనా దీప్తి**

**విశ్వంభర, నల్లగొండ మే 22 :** ఈనెల 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్దులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా యస్.పి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల సమీపంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, అన్ని మూసి వేయాలని ఆదేశించారు. పరీక్షా సెంటర్స్ నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు అని ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించ కూడదు అని పేర్కొన్నారు. విద్యార్దులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ తెలిపారు.

# నెంబర్ ప్లేట్‌లు లేని 25 వాహనాలపై కేసు

**విశ్వంభర, నల్లగొండ మే 22 :** వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లాలో ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనల విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ చందన దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి 25 వాహనాల పైన కేసులు నమోదు చేశామ తెలిపారు. జిల్లాలో చాలా మంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలపై ప్రయాణిస్తున్నారని అది చట్టరీత్యా నేరమని ఇకనైనా తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ ప్రభుత్వం నిర్దేశించిన విదంగా ఉండాలని లేని యెడల వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా తిరిగేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయబడుతాయని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు ట్రాపిక్ నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ ను వాహనాలకు బిగించుకోవాలని, కొంత మంది నంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడుపుతూ అనేక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాగే ప్రతి వాహనానికి నంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని లేని యెడల ఎంవీ ఆక్ట్ క్రింద కేసులు నమోదు చేయబడుతాయని హెచ్చరించారు.



సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టీ పద్మారావు గౌడ్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ.. అరుణాచలేశ్వరుడిని దర్శించున్న బీఆర్ఎస్ అంబర్ పేట డివిజన్ మాజీ అధ్యక్షుడు గొల్యాల మల్లేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు జాకీ బాబు, మహేష్, వీరేందర్ రెడ్డి

**– విశ్వంభర, అంబర్‌పేట**

# పట్టభద్రుల ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి



**విశ్వంభర, నల్లగొండ మే 22 :** వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కు తెలియజేశారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి వరంగల్-ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై నల్గొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తోపాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ ఆదనపు కలెక్టర్లు, ఏఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికకు సంబంధించి చేసిన ఏర్పాట్లపై సీఈవో అడిగగా జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలు, మరో 5 ఆక్సిలరి పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 5 లక్షల బ్యాలెట్ పేపర్లు రాష్ట్రస్థాయి నుండి రావడం జరిగిందని, వాటన్నిటిని సంబంధిత జిల్లాలకు పంపించామని, పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సైతం సిద్ధంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని, వీరందరికీ మొదటి విడత శిక్షణ కార్యక్రమాలను సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నామని, 96 టేబుల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాసిగా తీసుకోవద్దని అన్నారు. ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకులు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుముందు నల్గొండ జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన జిల్లాల అదనపు కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఎం.ఎల్.సి ఎన్నికల పై సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ చందన దీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ నల్గొండ, మిర్యాలగూడ ఆర్డీవోలు, ఏఆర్వోలు రవికుమార్, శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరుకాగా, రాష్ట్రస్థాయి నుండి ఆదనపు సీఈవోలు సర్ఫరాజ్, లోకేష్ కుమార్, డిప్యూటీ సి ఈవో ఎల్ సత్యవాణి తదితరులు హాజరయ్యారు.

# మిల్లర్లు సీఎంఆర్ త్వరితగతిన అందజేయాలి

### కలెక్టర్ హరిచందన దాసరి



**విశ్వంభర, నల్లగొండ మే 22:** రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్లో రైస్ మిల్లర్లతో 2023- 24 వానాకాలం, యాసంగి కస్టం మిల్లింగ్ రైస్ పై సమీక్షించారు. 2023-24 వానకాలానికి సంబంధించిన సీఎంఆర్ ను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కాగా జిల్లాలో వానకాలంలో మిల్లర్లకు ప్రభుత్వం 3,22,754 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 216816 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా.. 104451 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ.. తక్కిన 1,16,365 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ను సైతం వెంటనే చెల్లించాలని, ఇందుకుగాను సీఎంఆర్ చెల్లించే విధానాన్ని వేగవంతం చేయాలని అన్నారు. కొందరు మిల్లర్లు 40 శాతం కన్నా తక్కువగా ఉన్నారని అలాంటివారు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితగతన చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలోరెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ఎఫ్సీఐ జిల్లా మేనేజర్ సుశీల్ కుమార్ సింగ్, మేనేజర్ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల ఆధికారి వెంకటేశ్వర్లు, తదితరులు హాజరయ్యారు.



## నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న
# ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో డీకే అరుణ

**విశ్వంభర, నల్లగొండ మే 22 :** ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న ప్రేమందర్ రెడ్డిని గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా బుధవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో విస్తృత ప్రచారం చేశారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ.. పట్టభద్రులు ఎవరికి ఓటు వేస్తే ఉపయోగముంటుందో ఆలోచించు ఓటు వేయాలన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న ప్రేమందర్ రెడ్డిని గెలిపించాలన్నారు. రేవంత్ రెడ్డిది మాటల గారడీ ప్రభుత్వం అన్నారు. పరిపాలనపై పట్టు లేక పాలన గాడి తప్పిందని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నోటిఫికేషన్ వేయకుండా 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. రైతులకు 500 రూపాయల బోనస్ అని రైతులను మోసం చేశారని విమర్శించారు. రాజీ లేకుండా నిరుద్యోగుల ఉద్యోగుల సమస్యలపై పోరాడే శక్తి భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసినా.. అది నిరుపయోగమన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి, జాతీయ నాయకుడు గోలీ మధుసూదన్ రెడ్డి, నలగొండ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కళ్యాణ నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, కనుమంత రెడ్డి, శ్రీదేవి రెడ్డి, కంకణాల నివేదితరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ పిల్లి రామ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగస్వామి, సాదినేని శ్రీనివాసరావు, గడ్డం మహేష్, రావేలు కాశమ్మ, కొండేటి సరిత, తార తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ ఎడ్‌సెట్ 2024

- రెండు విడతలుగా ఎగ్జామ్
- పరీక్ష రాయనున్న 33,879 మంది

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** రెండు సంవత్సరాల బీఈడీ ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ ఎడ్‌సెట్ 2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కన్వీనర్ ఆచార్య తాళ్ళ మృణాళిని తెలిపారు. మే 23న రెండు విడతలుగా జరగనున్న ఈ పరీక్షకు 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌లో 16,929 మంది, రెండవ సెషన్లు 16,950 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 79 పరీక్ష కేంద్రాల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూలు, విజయవాడ నగరాల్లో సైతం పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు https://edcet.tsche.ac.in వెబ్ సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాల సమాచారాన్ని సవివరంగా తెలుసుకొని 90 నిమిషాల ముందు చేరుకోవాలని తెలిపారు. మొదటి విడత పరీక్షకు హాజరు కావలసిన అభ్యర్థులు ఉదయం 8:30 గంటల కల్లా, రెండవ విడత అభ్యర్థులు మధ్యాహ్నం 12:30 కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమయ నిబంధన ఉన్న కారణంగా ఉదయం పరీక్ష కేంద్రాలకు 10 గంటల తర్వాత, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోరని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లుకు నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి రెండవసారి ఎడ్‌సెట్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఆచార్య గోపాల్‌రెడ్డి తెలిపారు. పలు దఫాలు వివిధ అధికారులతో సమావేశాలు నిర్వహించి సజావుగా సాగేందుకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు.



# తండాలపై విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

### పీఎన్పీఎస్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్

**విశ్వంభర, కుల్కచర్ల మే 22 :** మండల పరిధిలో ఘనపూర్ గ్రామపంచాయతీ అనుబంధ తండాలు సుబ్యా నాయక్ తండా, సక్రియ నాయక్ తండా, గోప్యానాయక్ తండాల్లో గిరిజనులు కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని పీఎన్పీఎస్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఏఈ సాయికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుంచి విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గోప్యానాయక్ తండాలో పాఠశాలకు విద్యుత్ వసతి కల్పించాలనా గతంలో ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా.. సమస్య పరిష్కారం కాలేదన్నారు. తండాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, అవసరం ఉన్నచోట మరమ్మతులు చేయాలన్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు భోజ్యా నాయక్, శ్రీధర్ నాయక్, రాజు నాయక్, విజయ్, పాండు నాయక్, మైబు, నర్సింలు, రత్నమ్మ, చంద్రనాయక్, శంకర్‌నాయక్, మహిళలు పాల్గొన్నారు.

# మారిన తెలంగాణ ఆర్టీసీ పేరు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్ పేరును టీజీగా మారుస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ఉత్తర్వులను కేంద్రం కూడా ఇటీవలే ఆమోదించింది. దీంతో.. వాహనాల రిజిస్ట్రేషన్లు కూడా టీజీ పేరుతోనే జరుగుతన్నాయి. ఇప్పుడు టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఆర్టీసీ గా మార్చబడింది. ఒకపై తెలంగాణ అంటే టీఎస్ అని కాకుండా టీజీ అని అన్ని ప్రభుత్వ శాఖల్లో వినియోగించాలని సీఎస్ శాంతికమారి ఇటీవల ఆదేశించారు. మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు, ఇంకా ఇతర స్వతంత్ర సంస్థలు, కమిషన్ లు రాష్ట్రాన్ని టీజీగా గుర్తించాలని తెలిపారు. పాలసీ డాక్యుమెంట్లు, నోటీసులు, సర్క్యులర్లు, లెటర్‌హెడ్లు అలాగే అధికారిక పత్రాలపై టీజీ కనిపించాలని అన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడే ఆర్టీసీ సంస్థ పేరును కూడా మార్చేశారు. టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఆర్టీసీగా మార్చబడిందని సంస్థ ఎండీ సజ్జనార్ ట్విట్టర్‌లో అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పేరు మార్పు జరిగిందని తెలిపారు. దీంతో.. తెలంగాణ ఆర్టీసీ ట్విట్టర్ అధికారిక ఖాతా కూడా టీజీఆర్టీసీకి మార్చబడింది. ప్రయాణీకులు తమ విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులను కొత్తగా మార్చిన ఈ ట్విట్టర్ ఖాతా ద్వారా తెలియజేయాలని ఎండీ సజ్జనార్ కోరారు. టీజీఆర్టీసీ అందించే సేవల గురించి తెలుసుకోవడానికి ఈ ఖాతాను ఫాలో అవ్వాలని చెప్పారు.



## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**విశ్వంభరి, పూడూరు మే 22:** మండల పరిధిలోని రాకంచెర్లలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన రాకమచర్ల యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడు రోజులు వైభవంగా కొనసాగుతాయి. 23న సాయంత్రం 7 గంటలకు లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణం, అనంతరం రథోత్సవం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ కమిలీ బాయి పెంటయ్య తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు రాజు, ప్రేమ్ కుమార్, రాజు, పరశురాం పాల్గొన్నారు.



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

# రాశి ఫలాలు

**19-05-2024 నుండి 25-05-2024 వరకు**



**మేష రాశి :** ఈ వరం విశేషంగా ఉన్నదని చెప్పవచ్చు. కార్య ఆటంకాలు కలిగిననూ సంపూర్ణంగా పనులు పూర్తి చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.



**వృషభ రాశి :** రాజ యోగంగా ఉన్నది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయాలు కొంత చికాకు కల్గిననూ వారం చివరన పూర్తి అవుతాయి. సోదర, బందు వర్గము నుండి విశేష సహకారం అందుకొందురు.



**మిథున :** శ్రమ చేత ఫలితాన్ని సాధించగలరు. కుతుమ్భాముున మాట విలువ తగ్గుతుంది. ఆర్థిక విషయాలు చికాకు కల్గిస్తాయి. కోర్టు, శత్రు కార్యాలు పరిష్కారం అగును.



**కర్కాటక :** గడ్డుకలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి రెండు సార్లు తిరగవలసి వచ్చును. వాహనం నడుపుటలో జాగ్రత్త అవసరం.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్ననూ అనుకున్న కోర్కెలను తీర్చుకుంటారు. కుటుంబ ఆర్థిక విషయాలు మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు ఏర్పడుతాయి. శారీరక శ్రమ అధికముగా చేయటం వల్ల శిరోవ్యాధి అధికమగును.




**కన్యారాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధను తీసుకొని జీవనాన్ని సాగించవలెను. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని అనుభవించ వలసి వస్తుంది. ఆర్థిక విషయాలు సామాన్యంగా ఉండును. సంతానం ద్వారా ధన నష్టం కల్గును.




**తులరాశి :** అనుకునంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. గతంలో ఉద్యోగం లేనివారికి ఈ వరం ఉద్యోగం లభించును. పుత్ర సంతానం వలన ప్రగతిని సాధిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా నిర్వహిస్తారు.



**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచ్చు. నూతన వస్తు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడి ఎడబాటు కల్గును. అభివృద్ధిలో ఆటంకాలు ఉన్ననూ అందరి మన్ననలతో ముందుకు సాగుతారు.




**ధనుస్సురాశి :** విశేష యోగావంతంగా ఉండును. తలచిన వెంటనే పనులు పూర్తి చేయుదురు. విదేశీ ప్రయాణాలు లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగావంతంగా ఉండును. భాగస్వామ్య వ్యాపారాలు సొంత నిర్ణయంతో చేసుకొనుట మంచిది.



**మకరరాశి :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారానికి ఆలోచిస్తారు. భార్య అనారోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన కాగితాలు, డబ్బు మర్చిపోదురు. బంధు వర్గం వారితో జాగ్రత అవసరం. విరోధం ఏర్పడును.



**కుంభరాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసట ఉండును. కుటుంబ, ఆర్థికంగా అలోచించి ముందుకు సాగుతారు. పుత్ర సంతానం అభివృద్ది ఎక్కువగా ఉండును. ఈ వారం స్నేహితులకు డబ్బులు బదులు ఇచ్చినచో తిరిగి రావు.



**మీనరాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడ లేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకులు కల్గిన్చిననూ నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.

# నిర్మాతలకు షాకిచ్చిన ఎగ్జిబిటర్లు

- ఇకపై బెనిఫిట్ షోలు ప్రదర్శించబోమని నిర్ణయం
- మల్టీపెక్స్‌ల మాదిరిగానే పర్సెంటేజీలు ఇవ్వాలని డిమాండ్
- జూన్ 1వ తేదీ వరకు నిర్మాతలకు టైం ఇచ్చిన ఎగ్జిబిటర్లు
- ఆందోళనలో ప్రొడ్యూసర్స్, సినీ అభిమానులు



**విశ్వంభర, సినిమా :** ఈ వేసవిలో థియేటర్స్ ఆక్యుపెన్సీ రేట్ తగ్గిందని, దీని వల్ల భారీగా నష్టాలు వస్తున్నాయని ఎగ్జిబిటర్లు సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసేశారు. అయితే ఈ నిర్ణయాన్నితెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, పలువురు డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలు తప్పుబట్టారు. సమస్యను మా దృష్టికి తేకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని అసహన్ వ్యక్తం చేశారు. అయినా ఎగ్జిబిటర్లు ఏమాత్రం వెనక్కు తగ్గకుండా సినిమా హాళ్లను మూతేశారు. ప్రస్తుతం తెలంగాణలోని చాలా సింగిల్ స్క్రీన్ థియేటర్లు క్లోజ్ అయ్యే ఉన్నాయి. మే 25 ఈ థియేటర్స్ ఓపెన్ కానున్నాయి. మరోవైపు థియేటర్స్, ఎగ్జిబిటర్స్ సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, పలువురు డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలు, ఎగ్జిబిటర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇకపై అద్దె ప్రాతిపదికన కాకుండా సినిమాలు పర్సెంటేజ్ రూపంలో డబ్బులు ఇవ్వాలని నిర్ణయించారు. వారం వారం తేడా ఉండేలా, ఒక్కో సినిమా కు దాని బడ్జెట్ బట్టి పర్సెంటేజ్ ఉండాలని నిర్ణయిం చారు.

### థియేటర్ల యజమానుల ఆందోళనకు కారణమిదే..

ఇదే విషయంపై మరోసారి తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్ల మీడియా సమావేశం నిర్వహించి మరిన్ని నిర్ణయాలు తీసుకున్నారు. నిర్మాతలు ఎగ్జిబిటర్లకు అనుకున్న విధంగా పర్సంటేజీలు ఇవ్వాలని, అద్దె ప్రతిపాదికన ఇక నుంచి సినిమాలు ప్రదర్శించమని, మల్టీప్లెక్స్ తరహాలోనే పర్సంటెజీలు చెల్లిస్తేనే సినిమాల ప్రదర్శన చేస్తామని తెలిపారు. దీనిపై నిర్మాతలు జులై 1 లోపు ఏ విషయం చెప్పాలని గడువు ఇచ్చారు. అయితే వీటిల్లో కల్కి, పుష్ప2, గేమ్ చేంజర్, భారతీయుడు సినిమాలకు మినహాయింపు ఇచ్చారు. అలాగే.. నిర్మాతలు పర్సంటేజీలు చెల్లించకపోతే సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత తప్పదని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో 2 వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు దేశవ్యాప్తంగా మూతపడ్డాయని, కొంత మంది డిస్టిబ్యూటర్లు సినిమా వ్యాపారాన్ని జూదంగా మార్చారని బెనిఫిట్ షోలు, అదనపు షోలతో మోసాలకు పాల్పడుతున్నారని, ఇకపై బెనిఫిట్ షోలు, అదనపు షోలు ప్రదర్శించం అని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఈ నిర్ణయాలతో అటు నిర్మాతలు ఆలోచిస్తుంటే ఇటు హీరోల అభి మానులు బెనిఫిట్ షోలు లేకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరి తెలంగాణ థియేటర్స్ తీసుకున్న నిర్ణయాలపై నిర్మాతలు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

## పుష్ప 2 మూవీ సెకండ్ సింగిల్ పై రష్మిక స్పెషల్ ట్వీట్




విశ్వంభర, సినిమా : పుష్ప 2 మూవీ సెకండ్ సింగిల్ పై రష్మిక స్పెషల్ ట్వీట్ చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ,క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో వస్తున్న లేటెస్ట్ మూవీ "పుష్ప 2"..బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు ఈ మూవీ సీక్వెల్ గా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల అయిన పోస్టర్స్ ,గ్లింప్సె ,టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ ఫస్ట్ సింగల్ ను రిలీజ్ చేశారు.'పుష్ప పుష్ప' అంటూ సాగె ఈ సాంగ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది.ఈ సాంగ్ విడుదల అయిన కొద్దీ గంటలకే రికార్డు వ్యూస్ తో అదరగొట్టింది.ఈ సాంగ్ కు రాక్ స్టార్ దేవిశ్రీ అందించిన మ్యూజిక్ ,అల్లు అర్జున్ స్టెప్స్ హైలైట్ గా నిలిచాయి. ఇదిలా ఉంటే ఈ మూవీ సెకండ్ సింగిల్ రిలీజ్ పై నేడు మేకర్స్ స్పెషల్ అప్డేట్ ఇచ్చారు.శ్రీవల్లి అనౌన్స్మెంట్ వీడియో వచ్చేస్తుంది, అని రేపు ఉదయం 11 గంటల 7 నిమిషాలకు ఈ అనౌన్స్మెంట్ వీడియో ఉంటుందని సినిమా యూనిట్ ప్రకటించింది. తాజాగా పుష్ప 2 మూవీ సెకండ్ సింగిల్ పై రష్మిక స్పెషల్ ట్వీట్ చేసింది.సాంగ్ షూటింగ్ మొత్తం ఎంతో అద్భుతంగా సాగిందని, ఈ సెకండ్ సింగిల్ తప్పకుండా అందరిని అలరిస్తుందని..సో ఎగ్జైటెడ్ అంటూ రష్మిక ట్వీట్ చేసింది. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.



## నువ్వు గెలవడం నేను చూడాలి..

విశ్వంభర, సినిమా: సమంత హెల్త్ ప్రాబ్లమ్స్ కారణంగా సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫొటోలు, వీడియోలు, తన పాడ్ కాస్ట్ లతో అందరికి దగ్గరవుతుంది. త్వరలో సమంత సిటాడెల్ సిరీస్ తో రాబోతుంది. అలాగే తన సొంత నిర్మాణ సంస్థలో మా ఇంటి బంగారం అనే ఓ సినిమాని కూడా ప్రకటించింది. తాజాగా సమంత తన సోషల్ మీడియాలో.. నువ్వు గెలవడం నేను చూడాలి అని ఇంగ్లీష్ లో కొటేషన్ ఉన్న ఓ ఫోటో షేర్ చేసింది. ఆ ఫోటో షేర్ చేస్తూ.. నీ హృదయం ఏం కోరుకుంటే, నువ్వు ఏం అవ్వాలనుకుంటే నేను దానికి సపోర్ట్ చేస్తాను. మీరు విజయానికి అర్హులు అని పోస్ట్ చేసింది. దీంతో ఈ పోస్ట్ వైరల్ గా మారింది.సమంత ఈ పోస్ట్ ఎవర్ని ఉద్దేశించి పోస్ట్ చేసింది, ఎవరు గెలవాలనుకుంటుంది అని అర్థం కాక అభిమానులు, నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. మరి సమంత ఈ పోస్ట్ ఎవరికోసం పెట్టిందో ఆమెకే తెలియాలి.

## 'నేను అక్కడ లేను..' యాంకర్ శ్యామల ఎమోషనల్



**విశ్వంభర, సినిమా :** బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ పార్టీలో తెలుగు టీవీ, ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన పలువురు నటులు పాల్గొన్నట్లు తెలిపారు. నటి హేమ సైతం రేవ్ పార్టీలో ఉన్నట్లు స్పష్టం చేశారు. తాను రేవ్ పార్టీలో లేనని చెప్పిన హేమపై సీర యాక్షన్ తీసుకునేందుకు సిద్దమవుతున్నారు. తెలుగు యాంకర్ శ్యామల కూడా రేవ్ పార్టీలో ఉన్నట్టు ప్రచారం జరిగింది. దీంతో ఆమె స్పందించారు. కావాలనే తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ రేవ్ పార్టీకి తాను వెళ్లలేదన్నారు. ఆ పార్టీ ఎప్పుడు, ఎక్కడ జరిగిందో తనకు తెలియదన్నారు. తనపై అసత్య ప్రచారం జరుగుతోందని ఎమోషనల్ అయ్యారు. ' ఓ రాజకీయ పార్టీతో అనుసంధానం అయ్యానని తెలిసి.. కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీపై, నాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. అసత్య ప్రచారంపై న్యాయ పోరాటం చేస్తాం. ఇప్పటికే కేసులు నమోదు చేయించాం. ఎవరైనా సరే నిజాన్ని తెలుసుకోవాలి. అసత్య ప్రచారాలు చేయడం సరికాదు." అని యాంకర్ శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు.

# ఐపీఎల్ చరిత్రలో కోహ్లి ఒకే ఒక్కడు..

## 8 వేల పరుగుల మైలురాయి




**విశ్వంభర, స్పోర్ట్స్ :** పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లి అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో 8వేల పరుగులు చేసిన మొదటి ఆటగాడిగా కోహ్లి చరిత్ర సృష్టించాడు. బుధవారం అహ్మదాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో కోహ్లి 29 పరుగులు చేయడం ద్వారా ఈ మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లి 24 బంతులను ఎదుర్కొన్నాడు. మూడు ఫోర్లు, 1 సిక్స్ బాది 33 పరుగులు చేశాడు. అరంగ్రేట సీజన్ 2008 నుంచి కోహ్లి ఐపీఎల్ ఆడుతున్నాడు. నాటి నుంచి నేటి వరకు కూడా కోహ్లి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. నేటి మ్యాచ్‌తో కలిపి ఇప్పటి వరకు 252 ఐపీఎల్ మ్యాచులు ఆడగా 244 ఇన్నింగ్స్‌ల్లో కోహ్లి బ్యాటింగ్ చేశాడు. 38.66 సగటు 131.97 స్ట్రైక్‌రేటుతో 8004 పరుగులు చేశాడు. ఇందులో 55 అర్ధశతకాలు, 8 శతకాలు ఉన్నాయి. విరాట్ తరువాతి స్థానంలో శిఖర్ ధావన్ ఉన్నాడు. శిఖర్ ధావన్ 222 మ్యాచుల్లో 6769 పరుగులు చేశాడు. ఆ తరువాత వరుసగా రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్, సురేశ్ రైనాలు ఉన్నారు.

### ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు..

- విరాట్ కోహ్లి – 252 మ్యాచుల్లో 8004 పరుగులు
- శిఖర్ ధావన్ – 222 మ్యాచుల్లో 6769 పరుగులు
- రోహిత్ శర్మ – 257 మ్యాచుల్లో 6628 పరుగులు
- డేవిడ్ వార్నర్ – 184 మ్యాచుల్లో 6565 పరుగులు
- సురేశ్ రైనా – 205 మ్యాచుల్లో 5528 పరుగులు

## విరాట్ కోహ్లి భద్రతకు ముప్పు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఐపీఎల్ 17వ సీజన్ ఆఖరి అంకానికి చేరుకుంది. అహ్మదాబాద్ వేదికగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో బుధవారం రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ కీలక మ్యాచ్ కు ముందు ఓ షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లి భద్రతకు ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలో బెంగళూరు జట్టు తమ ప్రాక్టీస్ ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో సోమవారం రాత్రి నలుగురు అనుమానిత ఉగ్రవాదులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఆయుధాలు, కొన్ని వీడియోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని గురించి బెంగళూరు, రాజస్థాన్ జట్లకు సమాచారం ఇచ్చారని, ఈ క్రమంలో విరాట్ కోహ్లి భద్రతకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో బెంగళూరులో మంగళవారం తమ ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసుకున్నట్లు స్థానిక మీడియాలో వార్తలు వచ్చాయి. అంతేకాదు.. రెండు జట్లు కూడా మీడియా సమావేశంలోనూ పాల్గొనలేదు.

### విరాట్ కోహ్లీ జాతీయ సంపద

'విరాట్ కోహ్లీ అహ్మదాబాద్ చేరుకున్న తర్వాత అరెస్టుల గురించి తెలుసుకున్నాడు. అతను జాతీయ సంపద, అతని భద్రత మా అత్యంత ప్రాధాన్యత 'అని పోలీసు అధికారి విజయ్ సింఘా జ్వాలా చెప్పారు. ఈ క్రమంలో ఆర్‌సీబీ సైతం ఎలాంటి రిస్క్ తీసుకోదలుచుకోలేదని, ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసుకుంటున్నట్లు తెలియజేసినట్లు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ మాత్రం యథావిధిగా ప్రాక్టీస్‌ను కొనసాగించిందన్నారు. ఆర్సీబీ ఆటగాళ్లు బస చేస్తున్న హొటల్ వద్ద సెక్యూరిటీని రెట్టింపు చేశారు. ఆ జట్టు ప్లేయర్ల కోసం ప్రత్యేక ఎంట్రీని ఏర్పాటు చేశారు. ఐపీఎల్ అనుబంధ మీడియా సిబ్బందిని సైతం లోనికి అనుమతించడం లేదు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ ప్రాక్టీస్ కోసం మైదానానికి వెళ్లే సమయంలో గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com